PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం – ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 131, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 02 - జూలై - 2026 , వెల రూ.5/-

## మూడెకరాల రైతులకు శుభవార్త.. రైతు భరోసా నిధులు జమ

- 10.68 లక్షల మందికి లబ్ధి.. ●రూ.1,590.02 కోట్లు జమ



- డీబీటీ ద్వారా ఖాతాల్లోకి నిధులు
- ఇప్పటివరకు రూ.4,072.04 కోట్లు విడుదల

2లో

## శెహభాష్.. లోకేశ్: విద్యా శాఖ మంత్రిగా లోకేశ్ పనితీరుకు రాష్ట్రపతి ప్రశంసలు

- ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌పై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు



- రాష్ట్రంలో విద్యా సంస్కరణలు కొనసాగించాలని సూచన

2లో

## బీచ్‌లను కూడా మద్యం కేంద్రాలుగా మారుస్తారా?

### బీచ్ షాక్స్ పేరుతో కొత్త మద్యం సంస్కృతికి తెరలేపుతున్నారన్న జగన్

- సామాన్య కుటుంబాలు బీచ్‌లకు ఎలా వెళ్తాయని ఆవేదన
- రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శ



అమరావతి: "కుటుంబాలు, చిన్నారులతో కలిసి ప్రశాంతంగా గడిపే బీచ్‌లను కూడా చంద్రబాబు ప్రభుత్వం మిగతా 2 లో



2లో

## ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' స్ఫూర్తితో 'స్వర్ణాంధ్ర-2047' నిర్మాణం

- ★ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం యువతకు గొప్ప ఆదర్శమని వెల్లడి
- ★ ఏపీని ఇన్నోవేషన్, టెక్నాలజీ, మ్యానుఫ్యాక్చరింగ్ గమ్యస్థానంగా మార్చుతామని స్పష్టీకరణ

అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేశ్

అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో చేపట్టిన 'వికసిత్ భారత్ 2047' స్ఫూర్తితో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్యం దిశగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## ఆదాయ సమీకరణపై అధికారులు సీరియస్‌గా దృష్టిసారించాలి



హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయ సమీకరణపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వివిధ శాఖలు సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఆదాయ సమీకరణపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. "హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ఆదాయ సమీకరణపై దృష్టిసారించాలి. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, మైనింగ్, ఇతర శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత వహించాలి. ఆదాయ సమీకరణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసుకుని నిరంతరం ఫాలో అప్ చేయాలి. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అను సంధానం చేసుకోవాలి. పెండింగ్ ప్రాజెక్టులు, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా బడ్జెట్‌ను తయారు చేసుకోవాలి. భూసేకరణను మొదటి ప్రాధా న్యతగా తీసుకోవాలి. ఊహాజనిత బడ్జెట్ కాకుండా వాస్తవికత ఆధారంగానే బడ్జెట్‌ను రూపొందించుకోవాలి. వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాలి" అని సీఎం దిశానిర్దేశం చేశారు.

## పాలనపై చర్చకు సిద్ధం.. తేదీ చెప్పండి...

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్



2లో

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటన
- తేదీ, సమయం ఖరారు చేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేసిన కేటీఆర్
- ప్రభుత్వ వైఫల్యాలను నిరూపించలేకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని వెల్లడి

# జగన్‌ను జైలులో పెట్టాలనుకుంటే నిమిషం చాలు...

### "వైఎస్ జగన్ అన్యాయంగా నన్ను జైలులో పెట్టాడు...

- ★ నాకు చేతకాదా?, అనుభవం లేదా?... నా ఉద్దేశం అది కాదు... రాష్ట్రం ఇప్పటికే నష్టపోయింది
- ★ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనేదే నా లక్ష్యం
- ★ దేశంలో నంబర్ 1 రాష్ట్రంగా ఏపీ ఉండాలి
- ★ ప్రపంచంలోనే నంబర్ 1 జాతిగా తెలుగు జాతి ఉండాలనేదే నా ధ్యేయం"
- ★ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 62.20 లక్షల మంది లబ్ధిదారులకు రూ.2,712 కోట్ల మేర భరోసా పెన్షన్లను చెల్లిస్తుంది



అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంచలన కామెంట్స్ చేశారు. వైఎస్ జగన్‌ను జైలులో పెట్టాలని అనుకుంటే, మిగతా 2 లో



2లో

## గూడూరులో దేశంలోనే అతిపెద్ద ఫర్నిచర్ పార్క్ రాబోతోంది: చంద్రబాబు

- 'పీ4' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంద్రబాబు పిలుపు
- ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే తమ సంకల్పమని వెల్లడి

## తమిళ రాజకీయాల్లో కీలక మలుపు.. డీఎంకే మాజీ మిత్రులతో సీఎం విజయ్ భేటీ

### తమిళనాడులో ప్రభుత్వాన్ని పటిష్టం చేసుకుంటున్న విజయ్

### డీఎంకే మాజీ మిత్రపక్షాలతో టీవీకే కీలక సమావేశం

### కొత్త లౌకిక కూటమి ఏర్పాటు, ఉపఎన్నికలే లక్ష్యంగా భేటీ

### ఏఐఏడీఎంకే నుంచి కొనసాగుతున్న ఎమ్మెల్యేల వలసలు



తమిళనాడు: తమిళనాడు రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ తన ప్రభుత్వాన్ని పటిష్టం చేసుకునే దిశగా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా, గతంలో డీఎంకే కూటమిలో కొనసాగిన భాగస్వామ్య పక్షాలను తనవైపు తిప్పుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఇండియన్ మిగతా 2 లో

# యాదగిరిగుట్టలో భూముల కేటాయింపు, తిరుమల విధానం స్టడీ చేయండి...

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి...

- ➤ సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- ➤ భూ యాజమాన్యపు హక్కులు యాదగిరిగుట్ట దేవస్థానంకే ఉండాలి
- ➤ ఆలయ పరిధిలోవివిధ అభివృద్ధి పనుల కోసం భూ సేకరణ కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలి



హైదరాబాద్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో వివిధ మఠాలకు భూముల కేటాయింపునకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో మిగతా 2 లో

## TRS టైటిల్ వార్.. కవిత పార్టీకి షాక్?

2లో




- కవిత పార్టీ పేరుపై అభ్యంతరాల వెల్లువ.. ఈసీకి 700 ఫిర్యాదులు
- కవిత కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పేరుపై అభ్యంతరం
- కేంద్ర ఎన్నికల సంఘానికి దాదాపు 700 అభ్యంతరాలు
- ఫిర్యాదు చేసిన వారిలో అత్యధికం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలే



2లో

## రేవంత్, భట్టి విక్రమార్క ఒకే వేదికపై వేర్వేరు లెక్కలు చెప్పారు.. ఎవరి లెక్కలు నిజం?

- శిల్పకళావేదిక సాక్షిగా రేవంత్, భట్టి విక్రమార్క అబద్ధాలు చెప్పారన్న హరీశ్
- రైతుల కోసం రూ.1.56 లక్షలు ఖర్చు చేశామని భట్టి చెప్పారని వెల్లడి

# పాకిస్థాన్‌కు సింధు నది జీవనాధారం అన్న బిలావల్ భుట్టో

ఢిల్లీ: సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని పాకిస్థాన్ భారత్‌ను హెచ్చరించింది. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి ఈ ఒప్పందం అత్యంత కీలకమని, దీనిని ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. ఇస్లామాబాద్‌లో నిర్వహించిన ఒక సదస్సులో పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) అధ్యక్షుడు బిలావల్ భుట్టో జర్దారీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. సింధు జలాల ఒప్పందం సక్రమంగా అమలు కాకపోతే, అంతర్జాతీయ వ్యవస్థల మనుగడే ప్రశ్నార్థకమవుతుందని వారు అభిప్రాయపడ్డారు. "సింధు జలాల ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దు చేయడం సాధ్యం కాదు. నీటిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సరికాదు" అని ఇషాక్ దార్ పేర్కొన్నారు. సింధు నది పాకిస్థాన్‌కు జీవనాధారమని అభివర్ణించిన బిలావల్ భుట్టో, తమ నీటి హక్కులకు భంగం కలిగిస్తే జాతీయ స్థాయిలో తీవ్ర నిరసనలు ఎదురవుతాయని హెచ్చరించారు. నదీ జలాలను ఆయుధాలుగా మలచుకోకుండా కట్టడి చేసేందుకు సరికొత్త అంతర్జాతీయ ఒప్పందం అవసరమని ఆయన ప్రతిపాదించారు. 2025 ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయిన ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ఈ ఒప్పందాన్ని నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ దాడి వెనుక పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల హస్తం ఉందని భారత్ ఆరోపించగా, పాక్ ఆ వ్యాఖ్యలను ఖండించింది. అయితే, సీమాంతర ఉగ్రవాదాన్ని పూర్తిగా అరికట్టే వరకు ఈ ఒప్పందం పునరుద్ధరణ సాధ్యం కాదని భారత్ తన పట్టును స్పష్టం చేస్తోంది. 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందం, ఇరు దేశాల మధ్య పలు యుద్ధాలు సంభవించినప్పటికీ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ ఒప్పందం నిబంధనల ప్రకారం రావి, సట్లెజ్, బియాస్ నదులపై భారత్‌కు.. సింధు, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు సర్వ హక్కులు కల్పించారు.

### శెహభాష్.. లోకేశ్:విద్యా శాఖ మంత్రిగా

# లోకేశ్ పనితీరుకు రాష్ట్రపతి ప్రశంసలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు అద్భుతంగా ఉన్నాయని, వాటిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని సూచించారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమం ముగిశాక, రాష్ట్రపతికి వీడ్కోలు పలికేందుకు మంత్రి లోకేశ్ హెలికాప్టర్ వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను తన వద్దకు పిలిచిన రాష్ట్రపతి, విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి కేంద్రంగా సాగుతున్న ఈ సంస్కరణలు చాలా బాగున్నాయని, భవిష్యత్తులోనూ అందిస్తూనే ఉండాలని అన్నారు. అంతకుముందు స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ చేసిన ప్రసంగం యువతకు ఎంతో స్ఫూర్తి నింపేలా సాగిందని రాష్ట్రపతి కొనియాడారు. పట్టభద్రులకు మంచి సందేశం ఇచ్చారని అభినందించారు. ఏపీ విద్యా విధానాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు లోకేశ్ కృషి చేస్తున్న విషయం తెలిసిందే.

## గూడూరులో దేశంలోనే అతిపెద్ద ఫర్నిచర్ పార్క్ రాబోతోంది: చంద్రబాబు

అమరావతి: "ఒకప్పుడు పెట్టుబడిదారులు రాష్ట్రం వదిలి పారిపోయారు. కానీ ఇప్పుడు మనపై ఉన్న నమ్మకంతో ఏపీని వెతుక్కుంటూ వస్తున్నారు" అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నెల్లూరు జిల్లా పున్నపువారిపాలెంలో జరిగిన ప్రజావేదిక సభలో పాల్గొన్న ఆయన, కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను ప్రజల ముందుంచారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సాగుతున్న 'పీ4' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... దేశానికి ఆదర్శంగా నిలిచిన ద్వాక్రా సంఘాల తరహాలోనే, రాష్ట్రంలో ఇకపై పారిశ్రామికవేత్తలు తయారు కావాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. దేశానికి వచ్చే మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయని, పారిశ్రామిక అభివృద్ధిలో రాష్ట్రం టాప్‌లో దూసుకుపోతోందని చెప్పారు. ఇందులో భాగంగానే గూడూరులో దేశంలోనే అతిపెద్ద 'మెగా ఫర్నిచర్ పార్క్' రాబోతోందని, దీని ద్వారా 10 వేల మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చంద్రబాబు ప్రకటించారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధితో పాటు పేదలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించి, సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ అందిస్తామని హామీ ఇచ్చారు.

## శాంతి స్థాపనలో మోదీ పాత్ర అభినందనీయం

### ఇరాన్ అధ్యక్షుడి ప్రశంస

ఢిల్లీ: ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, సహకారాన్ని పెంపొందించడంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న విశేష కృషిని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రశంసించారు. మంగళవారం ప్రధాని మోదీతో జరిపిన టెలిఫోన్ సంభాషణలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం ఈ చర్చల వివరాలను వెల్లడించింది. ఇటీవల భారత్ విజయవంతంగా నిర్వహించిన బ్రిక్స్ ఇంధన మంత్రుల సమావేశం పట్ల పెజెష్కియాన్ సంతృప్తి వ్యక్తం చేశారు. బ్రిక్స్ వంటి బహుళపక్ష వేదికల ద్వారా ఇరు దేశాల మధ్య సహకారం మరింత విస్తరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక సంబంధాలను గుర్తుచేస్తూ.. రాజకీయ, ఆర్థిక, వాణిజ్య, రవాణా, అంతర్జాతీయ వ్యవహారాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత మెరుగుపరుచుకోవడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రాంతీయంగా చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఉద్రిక్తతలను తగ్గించేందుకు కుదిరిన ఒప్పందాలకు ఇరాన్ కట్టుబడి ఉందని పెజెష్కియాన్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. శాశ్వత శాంతి, భద్రతల స్థాపన కోసం ఇతర పక్షాలు కూడా బాధ్యతాయుతంగా నిబంధనలను అమలు చేయాలని ఆయన కోరారు. దురాక్రమణలను నిరోధించడంలో అంతర్జాతీయ సమాజం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ వేదికలపై అనేక అంశాల్లో ఇరు దేశాల అభిప్రాయాలు ఏకీభవించడం వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు, స్వేచ్ఛా నౌకాయాన పరిరక్షణకు దోహదపడే ఒప్పందాలను ప్రధాని మోదీ గతంలోనూ స్వాగతించిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉన్నత స్థాయి చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## 40 ఏళ్ల నిరీక్షణకు తెర..

## 1986 తర్వాత నాకౌట్‌లో మెక్సికో తొలి గెలుపు

ఢిల్లీ: నాలుగు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, ఫిఫా ప్రపంచకప్ నాకౌట్ దశలో మెక్సికో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఈక్వెడార్‌ను 2-0 తేడాతో ఓడించి రౌండ్ ఆఫ్ 16లో అడుగుపెట్టింది. మెక్సికో సిటీలోని ప్రఖ్యాత అజ్టెకా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు అద్భుతమైన ప్రదర్శనతో అభిమానులను ఉర్రూతలూగించింది. 1986 తర్వాత ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో మెక్సికోకు ఇదే తొలి విజయం కావడం విశేషం. మ్యాచ్ ప్రారంభానికి ముందు ఉరుములతో కూడిన వర్షం కారణంగా గంట ఆలస్యమైనప్పటికీ, స్టేడియంలోని 80,000 మందికి పైగా అభిమానుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. ఆరంభం నుంచే మెక్సికో దూకుడుగా ఆడింది. ఆట 22వ నిమిషంలో రాబర్టో అల్వరాడో అందించిన పాస్‌ను సద్వినియోగం చేసుకున్న జూలియన్ క్వియోన్స్, అద్భుతమైన గోల్‌తో మెక్సికోకు ఆధిక్యాన్ని అందించాడు. ఈ టోర్నమెంట్‌లో అతనికి ఇది మూడో గోల్. మరో 9 నిమిషాల తర్వాత, 31వ నిమిషంలో స్టార్ ప్లేయర్ రౌల్ జిమెనెజ్ మరో గోల్ చేసి మెక్సికో ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. అంతర్జాతీయ కెరీర్‌లో ఇది అతనికి 47వ గోల్. తొలి అర్ధభాగంలోనే రెండు గోల్స్‌తో పటిష్ట స్థితిలో నిలిచిన మెక్సికో, రెండో అర్ధభాగంలో డిఫెన్స్‌పై దృష్టి సారించింది. ఈక్వెడార్ ఆటగాళ్లు గోల్ చేయడానికి చేసిన ప్రయత్నాలను సమర్థంగా అడ్డుకుంది. మరోవైపు మెక్సికో కెప్టెన్ సీజర్ మోంటెస్ కూడా గోల్ చేసే అవకాశాలను తృటిలో చేజార్చుకున్నాడు. ఆట చివరిలో అదనపు సమయంలో రిఫరీతో వాగ్వాదానికి దిగిన ఈక్వెడార్ డిఫెండర్ పియరో హిన్‌కాపీకి రెడ్ కార్డ్ చూపడంతో ఆ జట్టు 10 మంది ఆటగాళ్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ విజయంతో 1994 నుంచి వరుసగా ఏడు నాకౌట్ మ్యాచ్‌లలో ఓడిపోయిన పరంపరకు మెక్సికో ముగింపు పలికింది. 1986లో బల్గేరియాపై ఇదే అజ్టెకా స్టేడియంలో నాకౌట్ విజయం సాధించిన తర్వాత, మళ్లీ ఇన్నాళ్లకు మెక్సికో అదే ఘనతను పునరావృతం చేసింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచ్‌లలో ఒక్క గోల్ కూడా ఇవ్వకుండా రికార్డు సృష్టించింది. 1990లో ఇటలీ తర్వాత ఈ ఘనత సాధించిన ఆతిథ్య జట్టుగా నిలిచింది. ఆదివారం అజ్టెకా స్టేడియంలో జరిగే రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ లేదా డీఆర్ కాంగోతో మెక్సికో తలపడనుంది. ఈ చారిత్రక విజయంతో జట్టులో, అభిమానుల్లో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది.

## రేవంత్, భట్టి విక్రమార్క ఒకే వేదికపై

## వేర్వేరు లెక్కలు చెప్పారు.. ఎవరి లెక్కలు నిజం?

హైదరాబాద్: శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పచ్చి అబద్ధాలు చెప్పారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే రేవంత్ రెడ్డి రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీశారని మండిపడ్డారు. రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో అన్నదాతల అసలు సమస్యలను ఈ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. ఒకే సభలో పక్కపక్కనే కూర్చున్న రేవంత్, భట్టి విక్రమార్క వేర్వేరు లెక్కలు చెప్పారని హరీశ్ ఎద్దేవా చేశారు. రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని భట్టి విక్రమార్క చెబితే... రేవంత్ రెడ్డి ఏకంగా రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెప్పారని... అసలు వీరిద్దరిలో ఎవరి లెక్కలు నిజమో చెప్పాలని నిలదీశారు. 2027 మార్చి వరకు వ్యవసాయ రంగానికి చేసిన మొత్తం బడ్జెట్ కేటాయింపులే సుమారు రూ.82 వేల కోట్లు అయితే, 2026 జూన్ నాటికే లక్షన్నర కోట్లకు పైగా ఎలా ఖర్చు చేశారో సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల సమయంలో షరతులు లేని రూ.2 లక్షల రుణమాఫీ అని ఓట్లు దండుకుని, తీరా అధికారంలోకి వచ్చాక కేవలం స్వల్పకాలిక రుణాలకే అది వర్తిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులను నిలువునా ముంచడమేనన్నారు. ఇకనైనా ఫేక్ ప్రచారాలు ఆపి, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో అన్నదాతలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి చేసిన రైతు మోసాలపై అసెంబ్లీతో పాటు ఏ వేదికపైనైనా చర్చకు తాము సిద్ధమంటూ సవాల్ విసిరారు.

# ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' స్ఫూర్తితో 'స్వర్ణాంధ్ర-2047' నిర్మాణం

విద్య, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలను సృష్టించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్తుకు సంసిద్ధమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన స్పష్టం చేశారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.

రాష్ట్రపతి ముర్ము జీవితమే ఒక పాఠం

ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో వేదిక పంచుకోవడం గొప్ప భాగ్యమని లోకేశ్ అన్నారు. ఆమె జీవితం తరగతి గదుల్లో నేర్చుకోలేని ఒక గొప్ప పాఠమని అభివర్ణించారు. "ఒక చిన్న గిరిజన గ్రామంలో పుట్టి, ఎన్నో వ్యక్తిగత విషాదాలను ఎదుర్కొని, విశ్వాసం కోల్పోకుండా ముందుకు సాగారు. ఉపాధ్యాయురాలిగా, శాసనసభ్యురాలిగా, గవర్నర్‌గా పనిచేసి, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాష్ట్రపతిగా మన ముందున్నారు. ఆమె ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఒక సత్యాన్ని బోధిస్తుంది. మన నేపథ్యం మన గమ్యాన్ని నిర్ధారించదు, మన ధైర్యమే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఆమె జీవితం లక్షలాది మంది భారతీయ యువతకు నిరంతరం స్ఫూర్తినిస్తుంది" అని లోకేశ్ వివరించారు.

చారిత్రాత్మకం.. తొలి బ్యాచ్

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవంలో పాల్గొనడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. "ప్రతి స్నాతకోత్సవం ప్రత్యేకమైనదే అయినా, మొదటిది ఎప్పటికీ చారిత్రాత్మకం. చరిత్ర ఒక్కసారే లిఖించబడుతుంది. రాబోయే ఏళ్లలో వేలమంది ఇక్కడి నుంచి పట్టాలు అందుకుంటారు. కానీ, మొదటి బ్యాచ్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆ వారసత్వం మీకే చెందుతుంది" అంటూ పట్టభద్రులకు, స్వర్ణ పతక విజేతలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగండి

మారుతున్న ప్రపంచంలో యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, అవకాశాలను సృష్టించే వారిగా మారాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "కేవలం ఉద్యోగార్థులుగా ఉండకండి, ఉద్యోగ సృష్టికర్తలుగా మారండి. సంస్థలను, ఆవిష్కరణలను, పరిష్కారాలను నిర్మించండి. ఎప్పుడూ సౌకర్యవంతమైన మార్గాన్ని ఎంచుకునే వారికి విజయం దక్కదు. కఠినమైన, తక్కువ మంది ప్రయాణించే మార్గాన్నే ఎంచుకోండి. అవే అద్భుతమైన విజయాలకు దారితీస్తాయి. వైఫల్యాలను తట్టుకుని నిలబడే ధైర్యం, మళ్లీ పుంజుకునే సంకల్పం కలిగి ఉండాలి" అని ఆయన సూచించారు. స్నాతకోత్సవంతో విద్య ముగిసిపోదని, ఇది జీవితకాల అభ్యసనకు నాంది మాత్రమేనని గుర్తుచేశారు.

టెక్నాలజీ హబ్‌గా ఏపీ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలకు గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని లోకేశ్ తెలిపారు. సాంకేతికత, తయారీ, పరిశోధన, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో యువతకు అపారమైన అవకాశాలు రానున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "ఈ ప్రాంగణం నుంచి వెళ్తున్న మీరు మీ విజ్ఞానాన్ని ఆత్మవిశ్వాసంతో, విలువలను వినయంతో, కలలను ధైర్యంతో ముందుకు తీసుకువెళ్లండి. మీ కుటుంబం, మీ విశ్వవిద్యాలయం, ఈ దేశం గర్వపడేలా గొప్ప వారసత్వాన్ని సృష్టించండి" అని లోకేశ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ శంకర్ ఆచార్య, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి తదితరులు పాల్గొన్నారు.

## మూడెకరాల రైతులకు శుభవార్త..

## రైతు భరోసా నిధులు జమ

హైదరాబాద్: తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయం పంపిణీ రెండో రోజూ కొనసాగింది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మూడెకరాల వరకు భూమి ఉన్న రైతులందరి బ్యాంకు ఖాతాల్లోకి బుధవారం నిధులను డీబీటీ విధానంలో నేరుగా జమ చేసింది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 10.68 లక్షల మంది రైతులకు రూ.1,590.02 కోట్ల పెట్టుబడి సాయం అందనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటి వరకు రైతు భరోసా కింద 54.96 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి మొత్తం రూ.4,072.04 కోట్ల నిధులను విజయవంతంగా బదిలీ చేసినట్లు తెలిపింది. వానాకాలం సాగు ప్రారంభమైన వేళ ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఈ సాయం ఉపయోగపడుతుండటంతో రైతులు సాగు పనులను వేగవంతం చేస్తున్నారు.

## బీచ్‌లను కూడా మద్యం కేంద్రాలుగా మారుస్తారా?: జగన్

అమరావతి: "కుటుంబాలు, చిన్నారులతో కలిసి ప్రశాంతంగా గడిపే బీచ్‌లను కూడా చంద్రబాబు ప్రభుత్వం వదలడం లేదు. బీచ్ షాక్స్ పేరుతో కొత్త మద్యం సంస్కృతికి తెరలేపుతోంది" అంటూ వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్ర సామాజిక వాతావరణాన్ని పూర్తిగా చెడగొట్టేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తే, రేపు సామాన్య కుటుంబాలు బీచ్‌లకు ఎలా వెళ్తాయని కూటమి సర్కార్‌ను నిలదీశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, వేధింపులకు గురిచేయడం, చివరకు లాకప్ డెత్‌లకు పాల్పడటం వంటి దారుణాలు రాష్ట్రంలో జరుగుతున్నాయని జగన్ ఆరోపించారు. చంద్రబాబుకు అసలు మానవత్వం ఉందా? అని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, విదేశీ పెట్టుబడులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పెట్టుబడులను ఆకర్షించే చేతగాని ఈ ప్రభుత్వం... కేవలం అవినీతి, దోపిడీ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని దుయ్యబట్టారు. "రాష్ట్రానికి కొత్తగా విదేశీ పెట్టుబడులు రావడం లేదు కానీ, ఇక్కడ దోచుకున్న సొమ్ము మాత్రం విదేశాలకు వెళ్తోంది" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## పాలనపై చర్చకు సిద్ధం.. తేదీ చెప్పండి

# రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత పాలన, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ఆయన ప్రకటించారు. ఈ చర్చకు సంబంధించిన తేదీ, సమయాన్ని ఖరారు చేయాలని ఆయన ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గడువులో సగం కాలం పూర్తయినా, చెప్పుకోవడానికి ఒక్క విజయం కూడా లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వరి సాగు 2014-15 నాటికి ఉన్న 26 లక్షల హెక్టార్ల నుంచి, పాలన ముగిసే సమయానికి 59 లక్షల హెక్టార్లకు పెరిగిందని గుర్తు చేశారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి గత ప్రభుత్వంపై నిందలు వేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ. 3.5 లక్షల కోట్లు మాత్రమేనని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత దారుణంగా ఉంటే ముఖ్యమంత్రి 72 సార్లు ఢిల్లీ పర్యటనలు ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ, ప్రెస్ క్లబ్ లేదా జూబ్లీహిల్స్ ప్యాలెస్.. వేదిక ఏదైనా చర్చకు తాను వస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చర్చకు రేవంత్ రెడ్డి లేదా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చినా తనకు అభ్యంతరం లేదన్నారు. "ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా నిరూపించడంలో నేను విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను" అని కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు.

## తమిళ రాజకీయాల్లో కీలక మలుపు..


## డీఎంకే మాజీ మిత్రులతో సీఎం విజయ్ భేటీ

మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) వంటి పార్టీలతో విజయ్ కీలక భేటీ నిర్వహించారు. ఎన్నికల అనంతరం తమకు మద్దతు ప్రకటించిన పార్టీలకు కృతజ్ఞతలు తెలిపేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు అధికారికంగా చెబుతున్నప్పటికీ, దీని వెనుక లోతైన రాజకీయ ప్రయోజనాలు ఉన్నట్లు తెలుస్తోంది. రానున్న ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన 'లౌకిక కూటమి'ని నిర్మించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. 2026 ఏప్రిల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించినప్పటికీ, మ్యాజిక్ ఫిగర్‌కు స్వల్ప దూరంలో నిలిచింది. ఇతర పక్షాల అండతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విజయ్, ప్రస్తుతం తన అధికారాన్ని సుస్థిరం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు అన్నాడీఎంకే నుంచి వలసల పరంపర కొనసాగుతోంది. తాజాగా కరూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఎం.ఆర్. విజయభాస్కర్ తన పదవికి రాజీనామా చేసి టీవీకేకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధపడటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి అన్నాడీఎంకేను వీడిన ఆరో ఎమ్మెల్యే ఈయనే కావడం విశేషం. తాజా పరిణామంతో అసెంబ్లీలో ఆ పార్టీ బలం మరింత క్షీణించింది. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలపై డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టీవీకే ప్రభుత్వం అస్థిరతతో కొట్టుమిట్టాడుతోందని, ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి అధికారాన్ని నిలబెట్టుకుంటోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అతి త్వరలోనే ముందస్తు ఎన్నికలు వస్తాయని జోస్యం చెప్పారు. అయితే, వ్యూహాత్మక పొత్తులు, ఉపఎన్నికల్లో విజయాల ద్వారా పూర్తిస్థాయి మెజారిటీని సాధించి, తమిళనాడు రాజకీయాలపై తనదైన ముద్ర వేయాలని విజయ్ పట్టుదలతో ముందుకు సాగుతున్నారు.

## వచ్చే ఎన్నికలు 'మావిగన్ వర్సెస్ అమరావతి'..

# చూసుకుందాం: జగన్



అమరావతి: ఏపీ రాజధాని అమరావతిని వైసీపీ అధినేత జగన్ మరోసారి తిరస్కరిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము మావిగన్ కే కట్టుబడి ఉన్నామని... వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి అని ఆయన అన్నారు. మావిగన్ ప్రతిపాదనకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని చెప్పారు. ఈ రెండు రాజధానుల్లో ప్రజల మద్దతు దేనికి ఎక్కువగా ఉందో వచ్చే ఎన్నికల్లో తేలిపోతుందని అన్నారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'జగన్ అమరావతికి వ్యతిరేకం' అంటూ కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని చెప్పారు. అమరావతి పేరుతో చంద్రబాబు సాగిస్తున్న స్కామ్‌లను, అవినీతిని మాత్రమే తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అవినీతి లేని రాజధాని కావాలనేదే తన ఆకాంక్ష అని, అందుకే ఈ మావిగన్ ప్రతిపాదనను తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ సరికొత్త ప్రతిపాదనకు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకే ఓటు వేస్తారని, వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టం చేశారు.

### జగన్‌ను జైలులో పెట్టాలనుకుంటే

# నిమిషం చాలు... చంద్రబాబు

అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంచలన కామెంట్స్ చేశారు. వైఎస్ జగన్‌ను జైలులో పెట్టాలని అనుకుంటే, తనకు ఒక్క నిమిషం పని అని అన్నారు. చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లాలోని చిల్లకూరు మండలం పున్నపువారిపాలెం గ్రామంలో నిర్వహించిన పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా 62.20 లక్షల మంది లబ్ధిదారులకు రూ.2,712 కోట్ల మేర భరోసా పెన్షన్లను చెల్లిస్తుందని తెలిపారు. ఎన్నికల్లో పెన్షన్ పెంచి చెల్లిస్తామని మాట ఇచ్చామని, ఆ మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. ఇప్పటి వరకు రూ. 68,598 కోట్ల మేర లబ్ధిదారులకు భరోసా పెన్షన్లను పంపిణీ చేశాం. అర్హులందరికీ పెన్షన్లు అందజేస్తామని తెలిపారు. "వైఎస్ జగన్ అన్యాయంగా నన్ను జైలులో పెట్టాడు... నేను అతడిని జైలులో పెట్టాలంటే ఒక్క నిమిషం పని... నాకు చేతకాదా?, అనుభవం లేదా?... నా ఉద్దేశం అది కాదు... రాష్ట్రం ఇప్పటికే నష్టపోయింది, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనేదే నా లక్ష్యం. దేశంలో నంబర్ 1 రాష్ట్రంగా ఏపీ ఉండాలి. ప్రపంచంలోనే నంబర్ 1 జాతిగా తెలుగు జాతి ఉండాలనేదే నా ధ్యేయం" అని చంద్రబాబు పేర్కొన్నారు. గత పాలకులు నెల్లూరు జిల్లాను అశాస్త్రీయంగా విభజించారని సీఎం చంద్రబాబు నాయుడు విమర్శలు గుప్పించారు. గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చామని... ఆ హామీని నెరవేర్చామని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు, కలవాయిపురం, సైదాపురం మండలాలను కూడా నెల్లూరు జిల్లాలో కలిపామని చెప్పారు. విజయవాడలో సాయికృష్ణను అరెస్ట్ చేసిన తర్వాత మిస్ అయ్యారని... ఈ విషయం తన దృష్టికి రావడంతోని వెంటనే సిట్ ఏర్పాటు చేశానని తెలిపారు. పోలీసులకు కూడా టెన్షన్స్ ఉంటాయని అన్నారు. రౌడీలు పోలీసులను ఛాలెంజ్ చేస్తే... పోలీసులకు కూడా రోషం వస్తుందని, వాళ్లు మనుషులేనని అన్నారు. తాను సిట్ వేసి దర్యాప్తు జరిపించాలని చూస్తే... కుల ముద్ర వేసి వివాదం సృష్టించాలని చూశారని వైసీపీపై మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రకరకాల పోస్టులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ కూతుళ్ల మీద కూడా అసభ్యకరమైన పోస్టులు చేశారని... వారిని మానసిక క్షోభకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. వారు ఏం తప్పు చేశారని చంద్రబాబు ప్రశ్నించారు. ఇలాంటి పనులు చేసేవాళ్లు మనుషులేనా? అని మండిపడ్డారు. తాను తన జీవితంలో ఎప్పుడూ బాధపడలేదని చంద్రబాబు చెప్పారు. అయితే తన భార్యను అసెంబ్లీ సాక్షిగా దూషిస్తే... ఉక్కు మనిషినైనా తాను కూడా కుంగిపోయానని చెప్పారు. ఫస్ట్ టైమ్ తన జీవితంలో బాధపడ్డానని తెలిపారు. ఇది కుటుంబంపై ఉండే గౌరమని తెలిపారు. ఆడబిడ్డలపై సోషల్ మీడియాలో అసభ్యకరమైరన పోస్టులు చేస్తూ సైకోలు పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్ళు అసలు మనుషులేనా? అని సీఎం చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు.

## యాదగిరిగుట్టలో భూముల కేటాయింపు, తిరుమల విధానం స్టడీ చేయండి... సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో వివిధ మఠాలకు భూముల కేటాయింపునకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో వివిధ మఠాలకు భూముల కేటాయించడానికి సంబంధించి స్పష్టమైన విధానం రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రధానంగా భూ యాజమాన్యపు హక్కులు యాదగిరిగుట్ట దేవస్థానంకే ఉండాలని చెప్పారు. ఆలయం పరిధిలో భూముల కేటాయింపు విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ (చారిటబుల్) ఫౌండేషన్ కోసం మార్కెట్ ధర ప్రకారం భూమిని కేటాయించాలని సూచించారు. గుట్టపైన అతిథి గృహాల నిర్మాణం కోసం ముందుకు వచ్చే వారి జాబితా రూపొందించాలని, అతిథి గృహాల నిర్మాణాల్లోనూ టీటీడీ అనుసరిస్తున్న విధానాన్ని ఇక్కడ అనుసరించాలని... దశల వారిగా అనుమతులు మంజూరు చేయాలని చెప్పారు. కుల సంఘాలకు స్థలం కేటాయింపుపైన కూడా స్పష్టమైన నిబంధనలతో కూడిన విధానం రూపొందించాలని అన్నారు. ఆలయ పరిధిలోవివిధ అభివృద్ధి పనుల కోసం భూ సేకరణ కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయం నిర్మాణానికి సంబంధించి ఇంజనీర్ల కమిటీ ఇచ్చిన నివేదికను సమగ్రంగా అధ్యయనంచేసి వారంలో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు.


హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి...

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో రాష్ట్రంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ సమకూర్చిన రెండు అంబులెన్స్‌లకు సీఎం రేవంత్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఎంఆర్ఐ స్కానర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. మహిళా స్వయం సహాయక సంఘాల నుంచి రుణాల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని... అందుకే మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలతో లాజిస్టిక్ పార్కులు, గోడౌన్లు, రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తున్నామని... అందుకోసం పెద్ద ఎత్తున రుణాలివ్వాలని కోరారు.

## టీఆర్ఎస్...టైటిల్ వార్... కవిత పార్టీకి షాక్...

### కవిత పార్టీ పేరుపై అభ్యంతరాల వెల్లువ..

# ఈసీకి 700 ఫిర్యాదులు




హైదరాబాద్: కల్వకుంట్ల కవిత స్థాపించిన నూతన రాజకీయ పార్టీ పేరుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఆమె ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పేరుపై కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) దాదాపు 600 నుంచి 700 వరకు అభ్యంతరాలు అందాయి. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ అభ్యంతరాలను ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు వ్యక్తం చేశారు. గతంలో 'తెలంగాణ రాష్ట్ర సమితి'గా ఉన్న తమ పార్టీ పేరును ఇది పోలి ఉండటం వల్ల ప్రజల్లో గందరగోళం తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు అభ్యంతరాలపై కవిత పార్టీ ప్రతినిధులు ఈసీకి వివరణ ఇచ్చారని, మిగిలిన వాటికి కూడా సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం. తెలంగాణ ఉద్యమంలో 'టీఆర్ఎస్' కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. 2026 ఏప్రిల్ నెలాఖరులో కవిత తన నూతన పార్టీని ప్రకటించిన సమయంలో, ఈ పేరుపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. అనంతరం, ఈసీఐ అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు ఇచ్చింది. జూన్ నెలలో బీఆర్ఎస్ పార్టీ అధికారికంగా అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు, సోలాపూర్‌కు చెందిన మరో సంస్థ కూడా ఇదే తరహా పేరు కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఈ ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం అందిన అన్ని అభ్యంతరాలను, వాటికి లభించిన వివరణలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రాజకీయ పార్టీల పేర్లు, గుర్తుల నిబంధనలకు అనుగుణంగా, ఓటర్లలో ఎలాంటి అయోమయం లేకుండా చూసేందుకు సమీక్ష నిర్వహించిన తర్వాతే ఈసీ తన తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది.

## రాయలచెరువులో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి సన్మానం



యాడికి జూలై 1 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రాయలచెరువు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రముఖ వైద్యులు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జన్మదినం, వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. డాక్టర్ బిసి రాయ్ వైద్య రంగంలోనే కాకుండా, రాజకీయాల్లోనూ విశేష సేవలు అందించారని కొనియాడారు. ప్రస్తుత కాలంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ దేవరాజ్ ప్రజలకు ఎంతో ఉత్తమమైన సేవలు అందిస్తున్నారని ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులను, సిబ్బందిని లయన్స్ క్లబ్ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రెటరీ శేషానంద రెడ్డితో పాటు రవి ప్రసాద్, సత్యనారాయణ, రవికుమార్ రెడ్డి, లక్ష్మీనారాయణ శెట్టి, సూర్యనారాయణ, రంజిత్ కుమార్, కులశేఖర్, ఇస్మాయిల్, శ్రీధర్ బాబు, రామ మోహన్ రెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు...

## హలో రైతన్న - ఛలో ఏలూరు ఆటోల ప్రచారం యాత్ర ప్రారంభం

### – జులై 3న రైతుల బహిరంగ సభను జయప్రదం చేయండి



ఏలూరు, నేటి శుభోదయ ::: ఈనెల 3,4,5 తేదీల్లో ఏలూరులో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు సందర్భంగా జులై 3న జరుగుతున్న హలో రైతన్న –చలో ఏలూరు కార్యక్రమం విజయవంతం కోసం ఆటోల ప్రచార యాత్రను బుధవారం ప్రారంభించారు. ఏలూరు పవర్ పేట లోని ఉద్దరాజు రాజు రామం భవనం నుండి ప్రారంభమైన యాత్రను సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. లింగరాజు, సీనియర్ నాయకులు కంది విశ్వనాధం రైతు సంఘం జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 3న ఏలూరులో జరుగుతున్న హాలో రైతన్న చలో ఏలూరు కార్యక్రమం సందర్భంగా మధ్యాహ్నం 2 గంటలకు జూట్ మిల్లు సెంటర్ నుండి రైతు మహా ప్రదర్శన అనంతరం 3 గంటలకు జిల్లా కలెక్టరేట్ వద్ద ఉన్న ఇండోర్ స్టేడియం గ్రౌండ్ లో బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. అన్ని పంటల రైతులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. అఖిల భారత రైతు సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. అన్ని పంటల రైతులకు కనీస ధరలు రాక నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి మద్దతు ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. పొగాకు, ఆక్వా, ఆయిల్ పామ్, కోకో, వరి, కూరగాయలు, పాడి,పౌల్ట్రీ తదితరు అన్ని పంటల రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి ఎన్ వి డి ప్రసాద్, పంపన రవికుమార్, ఎస్.సాయి కృష్ణ, కోటేశ్వరరావు పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## "ఆర్టీసీ విశ్రాంత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి! ఎమ్మెల్యే బొలిశెట్టి హామీ"



తాడేపల్లిగూడెం జులై 1 (అవినాష్ మారంపూడి నేటి–శుభోదయ):::: ఆర్టీసీ విశ్రాంత కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఉదయం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ను కలిసి తమకు సామాజిక పింఛను ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు.తాము ఆర్టీసీలో ముప్పై నుండి ముప్పై అయిదేళ్లు అతి తక్కువ వేతనాలతో ఉద్యోగం చేశామని , సర్వీసు పూర్తిచేసి ఉద్యోగ విరమణ చేశాక తమకు నామమాత్రపు పింఛను మాత్రమే వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేసారు. 2014 కు ముందు ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు వెయ్యి రూపాయల నుండి 1400 రూపాయలు మాత్రమే పింఛను వస్తుండగా, ఆ తర్వాత రిటైరైన వారికి 2000 రూపాయలు మాత్రమే పింఛను వస్తున్నదని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య పింఛను కోసం దరఖాస్తు చేయగా ఆధార్ కార్డులో ఉద్యోగి అని ఉండటంతో తమకు పింఛను సహా ప్రభుత్వ పథకాలు ఏవీ అమలు కావడంలేదని వారుఆ ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్టీసీ విశ్రాంత కార్మికులుగా తమకు తగిన పింఛను రాకపోవడంతో కుటుంబాల పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని, రిటైరయ్యాక కూడా ఆధార్ కార్డులో ఉద్యోగి అని ఉండటమే అందుకు కారణమని వారు విన్నవించారు. ఆధార్ కార్డు లో తగిన మార్పు చేయించి తమకు సామాజిక పింఛను ఇప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన బొలిశెట్టి శ్రీనివాస్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఓసూరి వీర్రాజు, జి.వెంకట్రావు, వై.కే.డి.రావు, కే.పి.దాసు, ఎం.కోటేశ్వరరావు, ఎ.ఎస్.నారాయణ, పి.సుబ్బారావు, ఎన్.సోమరాజు, ఆర్.వి.ఎస్. నారాయణ, జి.ఎం.కాళి, ఎస్.పి.కాపు, జి.సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె జబ్బుల చికిత్స (కార్డియాలజీ) విభాగం, సూపర్ స్పెషాలిటీ సేవలను ఏర్పాటు చేయాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి బీజేపీ నాయకులు వినతి



నంద్యాల, నేటి శుభోదయ ::: నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు లేకపోవడం వల్ల పేద రోగులు పడుతున్న ఇబ్బందులను మీ దృష్టికి తీసుకువస్తున్నామని. ప్రస్తుతం, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె జబ్బులకు సంబంధించి సరైన చికిత్స, పరికరాలు లేకపోవడం వల్ల రోగులు అత్యవసర పరిస్థితుల్లో కర్నూలు, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోందని. ప్రయాణ సమయం పెరగడం, ప్రైవేట్ ఆసుపత్రుల ఆర్థిక భారం వల్ల ఎంతో మంది ప్రాణాపాయ స్థితిలో ఉంటున్నారని. నంద్యాల ప్రాంతంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండటం చాలా అవసరమని. రాష్ట్ర, కేంద్ర ఆరోగ్య శాఖాధికారులతో మాట్లాడి, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో 'సూపర్ స్పెషాలిటీ' విభాగాన్ని ఏర్పాటు చేసి కార్డియాలజీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ నాయకులు అప్పు పోగుల వెంకటసుబ్బయ్య, నర్ల మహేశ్వర్ రెడ్డి, సుర్విపల్లి శివ నరసింహ గౌడ్ . రెడ్డి చర్ల ప్రసాద్ రాజు లు బుధవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి వినతి పత్రం ఇచ్చారు.

## "పిల్లల చదువులకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రోత్సాహం అభినందనీయం!

### ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్"



తాడేపల్లిగూడెం జులై 1 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):::కార్మిక కుటుంబాలలోని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు భవననిర్మాణ కార్మికసంఘం తరపున నగదు బహుమతులు, ప్రోత్సాహకాలు అందించడం మంచి పరిణామమని ప్రభుత్వ విప్,స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించారు. కార్మికసంఘాలు చేపట్టే ఇలాంటి చక్కని కార్యక్రమాలకు తమ వంతు సహాయం తప్పనిసరిగా ఉంటుందని అన్నారు.ఏఐటియుసి అనుబంధ ఏరియా తాపీ, వడ్రంగి, సెంటరింగ్,రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిపాయిపేట యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన విద్యా ప్రోత్సాహకాల ప్రదానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనియన్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.గత మూడేళ్ళుగా భవన నిర్మాణ కార్మిక కుటుంబాలలోని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు యూనియన్ తరపున బహుమతులు ఇస్తున్నామని పడాల శ్రీనివాస్ వివరించారు.ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల శ్రేయస్సు కోసం తల్లి తండ్రులు ఎంతో కష్టపడతారని , వారిని వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు తపిస్తారని , పిల్లలు కూడా తల్లితండ్రుల కష్టాన్ని ఆశలను దృష్టిలో ఉంచుకుని చదువుల్లో రాణించాలని హితవు పలికారు. చదువు వల్లనే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్న వాస్తవాన్ని తెలుసుకోవాలని అన్నారు. భవననిర్మాణ కార్మిక కుటుంబాల లోని పిల్లల చదువులను ప్రోత్సహించడానికి యూనియన్ చేపట్టిన ఈ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా ఉందని ప్రశంసించారు. ఇలాంటి మంచి కార్యక్రమంలో తన వంతు పాత్ర కూడా ఉండాలని భావిస్తున్నానని చెప్పిన బొలిశెట్టి శ్రీనివాస్ అక్కడికక్కడే 50 వేల రూపాయలు విరాళాన్ని ఏఐటియుసి నేత డి.సోమ సుందర్ కు, యూనియన్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ కు అందచేశారు.ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ మాట్లాడుతూ కార్మిక హక్కులకోసం, సంక్షేమం కోసం చేస్తున్న కృషిలో భాగంగా దాదాపు మూడు వేల మంది భవన నిర్మాణ కార్మికులను వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో చేర్పించామన్నారు. రెండు వేల మందిని ఈ శ్రమ పోర్టల్ లో నమోదు చేయించామని వివరించారు. కూటమి ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించడం హర్షణీయమని అయితే గత ప్రభుత్వ హయాంలో పెండింగులో ఉన్న క్లెయిములకు సొమ్ము మాత్రం చెల్లించలేదని ఈ సమస్యను పరిష్కారం చేయాలని సోమసుందర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా సీనియర్ నాయకులు పాలూరి లక్ష్మణరావు, జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశీ, బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఈతకోట భీమశంకరరావు (తాతాజీ,) బీజేపీ పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, జనసేన నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, ఏఐటియుసి ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, కార్యదర్శి మందలపర్తి హరీష్, యూనియన్ జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, ఏరియా భవన నిర్మాణ కార్మికసంఘం గౌరవాధ్యక్షుడు అంకం భాస్కరరావు, కార్యదర్శి పంతం రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కోడె సాయి బాలాజీ, కోశాధికారి మాదు శ్రీనివాస్ , యూనియన్ సీనియర్ నాయకులు బోడపాటి నాగేశ్వరరావు, గొర్రెల రాజు, రౌతు శ్రీనివాసరావు, బోడపాటి కృష్ణ మాట్లాడారు.యూనియన్ నాయకులు జువ్వలపాలెపు సత్యనారాయణ , చల్లా శ్రీనివాస్, దూలం ఆనంద్ , పెరికల శివ , పిల్లంగోళ్ళ కృష్ణ , తాడేపల్లి రాజు, సందక కొండ , కల్లూరు బాలాజి, పళ్ళా బాల బాలాజీ , చిలుకూరి శివ,ఎర్ర వెంకటేశ్వరరావు,రామిశెట్టి నాగు,కర్రి గోవిందు, శెట్టి సింహాచలం , నాగిరెడ్డి శ్రీను, బండారు నాగు తదితరులు పాల్గొన్నారు.భవననిర్మాణ కార్మికుల కుటుంబాల నుండి ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ళలో పదో తరగతి చదివి 2026 మార్చిలో జరిగిన పరీక్షలలో ఉత్తీర్ణులు కావడంతో పాటు అత్యధిక మార్కులు సాధించిన ముప్పై మంది విద్యార్థులకు లక్ష రూపాయల విలువైన నగదు పారితోషికాలు, జ్ఞాపికలు, స్కూల్ బ్యాగ్ లు నోటు పుస్తకాలు, పెన్నులు , అతిధుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. మార్కుల్లో టాపర్లుగా నిలిచిన దర్శిపర్రు జడ్పీ హైస్కూలు విద్యార్థిని పంతం గాయత్రీ దుర్గ కు, వాణీ పబ్లిక్ స్కూలు విద్యార్థిని మిరియాల లక్ష్మీ ప్రసన్న కు యూనియన్ తరపున చెరో 10,000/-పదివేల రూపాయల నగదు పారితోషికం అందచేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.


## నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక కార్పొరేట్ వైద్యం లక్ష్యం

### – నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో క్రిటికల్ కేర్ వైద్యం అందుబాటులోకి తెస్తాం– వైద్య వృత్తి దైవంతో సమానం – ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



నంద్యాల, నేటి శుభోదయ ::: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని ఉమ్మడి ప్రభుత్వం వైద్యం కోసం అధిక నిధులు వెచ్చించి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం కూడా వైద్య సేవలకు నిధుల కొరత లేకుండా చూస్తుందని, నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అత్యవసర, క్రిటికల్ కేర్ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నంద్యాల జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు ఆధునిక, కార్పొరేట్ వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్బంగా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ నిధులు రూ. 50 లక్షలతో ఆధునిక పరికరాల ప్రారంభం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి అందించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి ఒక్క ఆధునిక పరికరం ఇవ్వలేదని, నిర్లక్ష్యంకు గురైందని, వెనుకబడ్డ ఆసుపత్రికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఎక్కువ నిధులు తెచ్చి ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పని చేస్తున్నాం అన్నారు. నంద్యాల ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో , గెయిల్ ఇండియా లిమిటెడ్,(సిఎస్ఆర్) నిధులు, నంద్యాల ఎంపీ నిధులు రూ. 50 లక్షలతో మిత్ర సంస్థ సహకారంతో నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అత్యాధునిక వైద్య పరికరాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ గానే, కాకుండా ఒక డాక్టర్ గా నా జిల్లా ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా, మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. డాక్టర్లు కూడా కుటుంబాలను త్యాగం చేసి రోగికి మంచి వైద్యం అందించి క్లిష్ట సమయంలో కూడా రోగిని బ్రతికించెందుకే శ్రమిస్తారన్నారు. ఎక్కడైనా చిన్న పొరపాటు జరిగితే డాక్టర్ నిర్లక్ష్యం అని దాడులు చేయడం సరికాదన్నారు. వైద్య వృత్తి దైవంతో సమానం అన్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా భారీ కేక్ ను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కట్ చేశారు. భారత రత్న డాక్టర్ బిదాన్ చంద్ర రాయ్ (డాక్టర్ బి సి రాయ్ ) జయంతి, వర్ధంతిని జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ప్రతి డాక్టర్ అంకిత భావంతో పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ జిలాని, డిప్యూటీ సూపరెంటెండెంట్ డాక్టర్ చిట్టిబాబు, గైనకాలజిస్టు హెచ్ ఓ డి డాక్టర్. పద్మజా, డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ క్రిస్టోఫర్, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి. విశ్వనాధ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## "కష్టపడి కాదు...ఇష్టపడి చదవండి" విద్యార్థులతో సూర్యచంద్ర



కాకినాడ జిల్లా, జగ్గంపేట జులై 01 నేటి శుభోదయ:చదువును భారంగా భావించి 'కష్టపడి' కాకుండా, సబ్జెక్టును అర్థం చేసుకుంటూ 'ఇష్టపడి' చదివినప్పుడే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఇష్టపడి చదవడం వల్ల జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని విద్యార్థులకు పాటంశెట్టి సూర్యచంద్ర సూచించారు.?కిర్లంపూడి మండలం వేలంక గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి,విద్యార్థుల సందేహాలు తీర్చి, విద్యాభివృద్ధిపై విద్యార్థులను చైతన్యపరిచారు.చాలామంది విద్యార్థులు చదివింది గుర్తుండటం లేదు అని బాధపడుతుంటారని దానికి కారణం జ్ఞాపకశక్తి తక్కువగా ఉండటం కాదని,ఆ సబ్జెక్టుపై ఆసక్తి లేకపోవడమేనని.ఏ విషయాన్నైనా మనం ఇష్టపడి,శ్రద్ధగా చదివితే అది మన మెదడులో బలంగా ముద్ర పడిపోతుందన్నారు. జ్ఞాపకశక్తి అనేది బట్టీ పట్టడం వల్ల రాదని,ఇష్టపడటం వల్ల వస్తుందని ?ఒత్తిడి లేని విద్యా విధానం ద్వారా చదువు అనేది జ్ఞానాన్ని ఇచ్చేదిగా ఉండాలని, ఒత్తిడి పెరిగితే ఉన్న జ్ఞాపకశక్తి కూడా నశిస్తుందని కాబట్టి విద్యార్థులపై తల్లిదండ్రులు, విద్యాసంస్థలు ర్యాంకుల కోసం ఒత్తిడి తేవడం ఆపాలని సూర్యచంద్ర కోరారు.?నాణ్యమైన విద్యే లక్ష్యంగా ఒత్తిడి లేని, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించడానికి, ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ మరియు ప్రాక్టికల్ లెర్నింగ్ విధానాలను తీసుకురావాలని సూర్యచంద్ర ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థులే ఈ దేశ భవిష్యత్తని,చదువును ఆనందిస్తూ సాగించాలని.పరీక్షలను చూసి భయపడవద్దని.ఇష్టపడి చదివి, మీ ఆలోచనా శక్తిని, జ్ఞాపకశక్తిని పెంచుకుని మీ లక్ష్యాలను చేరుకోవాలని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర విద్యార్థులకు తెలియజేశారు

## ఆంధ్రా ఎన్ఆర్ఈజీఎస్ పనులన్నీ తెలంగాణ గుత్తేదారుకే

### ప్రభుత్వాలు మారిన కాంట్రాక్ట్ పనులన్నీ అతనికే

### తెలంగాణ గుత్తేదారును నెత్తిన పెట్టుకున్న ఆంధ్ర అధికారులు..



చింతూరు డివిజన్ నేటి శుభోదయ:చింతూరు ఐ టీ డి ఏ పరిధిలోని ఎన్ ఆర్ ఈ జి ఎస్ పనులన్నీ తెలంగాణకు చెందిన ఒక గుత్తేదారుకు అధికారులు అప్పాజెప్పి దోచిపెడుతున్నట్టు ఆరోపణలు వినపడుతున్నాయి. మొత్తం 11 మండలాల పరిధిలో వందల కోట్ల ఎన్ ఆర్ ఈ జి ఎస్ పనులన్నీ నాసిరకంగా చేపడుతున్న అధికారులు అందరు అయనకే వస్తాను పలకటం గమనార్హం. పై ఆరోపణలకు బలాన్ని చేయకురుస్తూ చింతూరు మండలం ఏడుగురాళ్ల పల్లి నుండి కూనవరం మండలం బోదునూరు వరకు నిర్మిస్తున్న రూ 698 లక్షల రోడ్డు అద్దం పడుతుంది. బోదునూరు రోడ్డు పై మొదటినుంచి అనేక ఆరోపణలు వచ్చిన సంభందిత అధికారులు పెద్దగా స్పందించిన దాఖలాలు లేవు.డబ్బు బలం అధికారుల అండ, అధికారంలో ఎవరు ఉంటె వారికీ గొడుగు పడుతూ ఎన్ ఆర్ ఇ జి ఎస్ పనులు చెపడుతున్నాడు. రహదారి పనుల్లో నాణ్యత మాత్రం నేతిబీరకాయలో నెయ్యి అంత ఉంది.సంకేతికి పరికరాలతో బొదునూరు రహదారి పై నిర్మించిన కలవర్టులు, చాప్టలను పరిశీలిస్తే డొల్ల తనం మొత్తం బయటపడుతుంది.చింతూరు డివిజన్ పరిధిలో చేపడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ రహదారి పనులపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా అనేక మంది కాంట్రాక్టర్లు ఉన్నప్పటికీ, తెలంగాణ కు చెందిన గుత్తేదారుకు పెద్ద ఎత్తున పనులు అప్పగించడం వెనుక అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఏడుగురాళ్లపల్లి––కోతులగుట్ట రహదారిపై నిర్మించిన కల్వర్టులను పరిశీలిస్తే నాణ్యత లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. సిమెంట్ తక్కువగా ఉపయోగించి, ఇసుక అధికంగా కలిపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రహదారుల నిర్మాణంలో ఇంజినీరింగ్ ప్రమాణాలు పాటించలేదని కూడా ఆరోపిస్తున్నారు. రహదారి ఒకవైపు ఎత్తుగా, మరోవైపు దిగువగా ఉండటంతో వర్షపు నీరు కల్వర్టులపై నుంచి ప్రవహించే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది భవిష్యత్తులో రహదారి దెబ్బతినే ప్రమాదాన్ని పెంచుతుందని చెబుతున్నారు. వర్షపునీరు వాగుల్లో కాలువల నుంచి ఇటు నుంచి అటు నుంచి ఇటు పారటం కోసం నిర్మించిన పైప్ కలవట్లు రహదారి నిర్మాణం పూర్తికకుండానే సగానికి పూడిపోయిన దృశ్యాలు ఫోటోల్లో చూడవచ్చు.పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు



నిర్మాణ దశలోనే సరైన తనిఖీలు నిర్వహించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఆ విమర్శలకు ఈ రహదారి పనులు అద్దం పడుతున్నాయి.నాణ్యత నియంత్రణ అధికారులు వెంటనే రంగంలోకి దిగి సాంకేతిక పరీక్షలు నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని గ్రామస్థులు కోరుతున్నారు.ఈ వ్యవహారంలో అధికారులపై వచ్చిన ఆరోపణలు నిజమా? కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించాడా? అన్న విషయాలపై ఉన్నతాధికారులు స్వతంత్ర విచారణ చేపట్టి, తప్పులు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాల పై జిల్లా కలెక్టర్ అలాగే చింతూరు ఐటిడిఎ పీఓ సమగ్ర విచారణ జరపాలని అదేవిదంగా ప్రజాధనం వృధా అవ్వకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ బల్లా పల్లవి ఔదార్యం

### పెన్షన్ అందే వరకు తన సొంత నగదును అందిస్తా

### భారతి కుటుంబ సభ్యులకు బల్లాపల్లవి భరోసా



అనంత పురం జూలై 01 నేటి శుభోదయ:కరుణామయ మహిళా మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కె ఎం ఎం స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి హాజరయ్యారు.ఈ సందర్భంగా, భారతి కుటుంబ సభ్యులు నేరుగా తమ సమస్యలను వివరించి సహాయం చేయాలని కోరారు. వారి పరిస్థితిని తెలుసుకుని, పెన్షన్ మంజూరయ్యే వరకు ప్రతి నెలా కుటుంబ ఖర్చుల నిమిత్తం రూ.4,000 ఆర్థిక సహాయం అందిస్తానని చైర్ పర్సన్ బల్లా పల్లవి ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు.అందులో భాగంగా ఈ నెలకు సంబంధించిన రూ.5,000 ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేయడం జరిగింది. అలాగే వారి కుమార్తెను బీసీ హాస్టల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటానని, కుటుంబ పెద్ద మరణించిన నేపథ్యంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని చైర్ పర్సన్ తెలియజేయడం జరిగింది.

## డాక్టర్ పామర్తి లీలావతి నాయకత్వంలో మంత్రి నారా లోకేష్ ను కలిసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

### –పదోన్నతులపై స్పందించిన మంత్రి నారా లోకేష్



అమరావతి, జులై 1( అజయ్ నారగాని – నేటి శుభోదయ )జూనియర్ కళాశాలల లెక్చరర్లకు డిగ్రీ లెక్చరర్ లుగా పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్. పామర్తి లీలావతి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు వినతి పత్రం అందచేశారు. గత 13 సంవత్సరాల నుండి పదోన్నతులు లేక వ్యధ చెందుతున్నామని, నెట్, స్లెట్, పీ హెచ్ డీ వంటి ఉన్నత అర్హతలు కలిగి ఉండి కూడా డిగ్రీ లెక్చరర్ లుగా పదోన్నతులు లేకుండా అనవసర జాప్యం చేస్తున్నారని వివరించారు. తమతో పాటు జూనియర్ లెక్చరర్స్ గా 2012 నియామకం పొందిన వారు తెలంగాణా రాష్ట్రం లో 2016 లో డిగ్రీ లెక్చరర్ లుగా పదోన్నతులు పొంది 10 సంవత్సరాల సర్వీసు పూర్తి చేయగా ఎలాంటి అడ్డంకులు లేకపోయినా తాము నష్టపోయామని 100 మంది అధ్యాపకుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రివర్యులు నారా లోకేష్ కు అందచేశారు. స్పందించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈనెల 5 వ తేదీ లోపు డీపీసి నిర్వహించి అందరికీ పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన మంత్రి నారా లోకేష్ కు సంఘ సభ్యులు డాక్టర్ రెడ్డి నీలవేణి, డాక్టర్ నాగేంద్రమ్మ, డాక్టర్ కిషోర్, డాక్టర్ జయరామ్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ రామలింగేశ్వర రావు, సుధాకర్, వెంకన్న తదితర అధ్యాపకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 'భావితరాల భవిష్యత్తు కోసం మరింత ఉత్సాహంగా పనిచేయండి'

**జనశ్రేణులతో ఏలూరు జనసేన అబ్జర్వర్ ఎమ్మెల్యే 'బత్తుల'..!**

**- జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పలు కమిటీల నిర్మాణ కసరత్తు కార్యక్రమం..**

రాజమహేంద్రవరం, కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ తలపెట్టిన జనసేన పార్టీ పూర్తిస్థాయి నిర్మాణం పటిష్టతలో భాగంగా..... జనసేన పార్టీ నిర్మాణ సారుదుల సమాచార సేకరణ కమిటీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఏలూరు పార్లమెంట్ అబ్జర్వర్ గా నియమితులైన రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మంగళవారం ఉంగుటూరు నియోజకవర్గం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ నిర్మాణ సారదుల సమాచార సేకరణ కమిటీ కార్యక్రమం నిర్వహించారు. అబ్జర్వర్, ఎమ్మెల్యే బత్తుల తో పాటు ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్, విజయవాడ ఆర్.టి. సి. జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కరాటం సాయి ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు,.ఈ సందర్భంగా బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ.. మన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశించినట్టుగా క్షేత్రస్థాయిలో పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన వారు, కష్టపడుతున్న వారు జిల్లా స్థాయి (పార్లమెంట్), నియోజవర్గ కమిటీ, మండల కమిటీ, గ్రామ కమిటీలలో అలానే వివిధ విభాగాల్లో పదవులు తీసుకోవాలని (కమిటీలో పనిచేయాలని) ఆసక్తి ఉన్నవారు ఏలూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల వారు ఏలూరు, కొప్పులు వెలమ కళ్యాణ మండపం నందు మీ అప్లికేషన్ నేరుగా అందజేయాలని పిలుపునిచ్చారు. మీ దరఖాస్తులను పరిశీలించి ఐటి టీం వారు కేంద్ర కార్యాలయానికి పంపడం జరుగుతుందని అనంతరం కేంద్ర అధిష్టానం ఈ అప్లికేషన్ పరిశీలించి సరైన వారికి తగిన రీతులు గుర్తింపు వచ్చేలా పవన్ కళ్యాణ్ అన్ని చర్యలు తీసుకుంటున్నారని ,దీనికి అందరూ పూర్తి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉంగుటూరు శాసనసభ్యులు పచ్చమట్ల ధర్మరాజుకి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ జనసేన నేతలు, జనసైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ సీట్ల కేటాయింపులో భారీ అక్రమాలు నిజం కాదు : జ్యోతి

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా పరిధిలో ఇటీవల జరిగిన బెస్ట్ అవైలబుల్ సీట్ల కేటాయింపులో భారీ అక్రమాలు నిజం కాదు అని ఎస్ సి, బిసి కార్పొరేషన్ ఈడి యలగందుల జ్యోతి పేర్కొన్నారు. " బెస్ట్ అవైలబుల్ సీట్ల కేటాయింపులో భారీ అక్రమాలు" అనే శీర్షికతో "నేటి శుభోదయ" దినపత్రిక లో వచ్చిన కథనం పై ఆమె స్పందించి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బెస్ట్ అవైలబుల్ సీట్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలు జరగ లేదు అని, అంతా పారదర్శకంగా జరిగినట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ కేటాయింపులకు సంబంధించి అంతా డిఈఓ పరిధిలో సీట్ల కేటాయింపులు జరిగినట్లు ఆమె తెలిపారు. కొందరు పని కట్టుకుని తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అలాంటివి నమ్మ వద్దని ఆమె తెలిపారు. తమ శాఖకు సంబంధించిన విషయంలో అన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాంటి తప్పుడు సమాచారం ఇవ్వకుండా భవిష్యత్తులో మరింత అప్రమత్తంగా ఉండి విద్యా అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

## విజయవాడ రూరల్‌కు చెందిన 32 మందికి రూ.24.77 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ కార్పొరేట్ వైద్యానికి దూరం కాకూడదు: యార్లగడ్డ వెంకట్రావు-**
**ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది: ఎమ్మెల్యే యార్లగడ్డ**



విజయవాడ, జులై 1( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఆపదలో ఉన్న పేద వారికి ముఖ్య మంత్రి సహాయ నిధి ఒక వరం లాంటిదని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం సాయంత్రం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. విజయవాడలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండలానికి చెందిన 32 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 24,77,088 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ కార్పొరేట్ వైద్యానికి దూరం కాకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లో తమకు అండగా నిలిచి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ వేడుక నిర్వహించిన సెయింట్ జాన్స్ హై స్కూల్

**ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన రెవరెండ్ ఫాదర్ మర్రి అనిల్ కుమార్**




నేటి శుభోదయ -- 01, పల్నాడు జిల్లా, కారంపూడి:పల్నాడు జిల్లా కారంపూడి మండలంలోని స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో 2026-27 నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ మర్రి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులు మంచి జ్ఞానాన్ని సంపాదించి, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించి అక్షరాలు దిద్దించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ సిస్టర్ బీనోమ చాకో మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెంపొందించుకోవాలని, ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తల్లిదండ్రులు పాఠశాలపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టే విధంగా విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు.అలాగే కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికి, పాఠశాల ప్రత్యేకతలు మరియు విద్యా కార్యక్రమాల విశేషాలను వివరించారు.ఈ కార్యక్రమంలో మరియ భవన్ సుపీరియర్ సిస్టర్ మరిసిమ్మ, సిస్టర్ సుజిత, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ సెక్రటరీ కె. కన్నబాబు



విజయవాడ, జూలై 1(నేటి శుభోదయ):- రాష్ట్ర దేవాదాయ శాఖ సెక్రటరీగా నియమితులైన కె. కన్నబాబు బుధవారం ఉదయం శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో దేవస్థానం అర్చక బృందం స్వాగతం పలికారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను కన్నబాబు కు అందజేశారు.

## డెంగ్యూ నివారణ అవగాహన మాసోత్సవాల సందర్భంగా ర్యాలీ



విజయవాడ, జూలై 1(నేటి శుభోదయ):- వర్షాకాలంలో డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ అన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు సూచనలతో బుధవారం డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా పాయకాపురం ప్రాంతంలో బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో భాగంగా ప్రజలకు డెంగ్యూ వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. దోమల లార్వాను ప్రత్యక్షంగా చూపిస్తూ, నిల్వ నీటిలోనే ఏడిస్ దోమలు వృద్ధి చెందుతాయని వివరించారు. ఇంటి పరిసరాల్లో కూలర్లు, నీటి ట్యాంకులు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా ప్రతి వారం పరిశీలించి శుభ్రం చేయాలని సూచించారు.అలాగే కాలువలు, డ్రైన్లు, ఖాళీ స్థలాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా పరిశుభ్రత పాటించాలని కోరారు. వర్షాకాలంలో దోమల ఉత్పత్తి వేగంగా పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులు, వృద్ధులు దోమతెరలు వినియోగించడంతో పాటు దోమల నివారణ చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే స్వీయ వైద్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. డెంగ్యూ నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, విజయవాడ నగరపాలక సంస్థ చేపడుతున్న యాంటీ లార్వా, ఫాగింగ్, పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. నగరవ్యాప్తంగా డెంగ్యూ నియంత్రణ చర్యలను ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటింటికీ లార్వా సర్వేలు నిర్వహిస్తూ దోమల ఉత్పత్తి ప్రదేశాలను గుర్తించి యాంటీ లార్వా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి శుక్రవారం "డ్రై డే" పాటిస్తూ నీటి నిల్వలను తొలగించడం ద్వారా డెంగ్యూ వ్యాప్తిని సమర్థవంతంగా నివారించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో డిస్టిక్ మలేరియా ఆఫీసర్ రాజ్ నాయక్, ఆరోగ్య శాఖ సిబ్బంది, మలేరియా విభాగం సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వార్డు సచివాలయ సిబ్బంది, పాయికాపురం కాలేజ్ విద్యార్థినీ విద్యార్థులు, పారిశుద్ధ్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పింఛన్ లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ పంపిణీ వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, జూలై 1(నేటి శుభోదయ):- విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఉదయం పాత రాజరాజేశ్వరిపేట పరిసర ప్రాంతాలలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు.ఆ ప్రాంతాల్లో గల పింఛను లబ్దిదారుల ఆధార్ కార్డు పరిశీలించి, ఫేస్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ ఆర్ ఎస్ ) ద్వారా చెక్ చేసి పింఛన్ డబ్బులు అందించారు. వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ప్రతినెల పింఛను వస్తుందా లేదా, ఇంటికి వచ్చి ఇస్తున్నారా లేదా, ఎంత డబ్బులు ఇస్తున్నారు లాంటి ప్రశ్నలు వాళ్ళని అడిగి, ప్రతినెలా ఇస్తున్న పింఛను తీరును పరిశీలించారు. ప్రతి నెల సమయానికి పెన్షన్ సిబ్బంది అందిస్తున్నారని ఎటువంటి సమస్యలు లేవని వారు తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మధ్యాహ్నం మూడు గంటల వరుకు, సర్కిల్ వన్ పరిధిలో 19,751 పెన్షన్ లకు గాను 18,371, సర్కిల్ 2 పరిధిలో 25,147 పెన్షన్ లకు గాను 23,429, సర్కిల్ 3 పరిధిలో 19,860 పెన్షన్ లకు గాను 18,403, మూడు సర్కిల్స్ పరిధిలో మొత్తం 64,758 పెన్షన్ లకు 60,203 పెన్షన్ల పంపిణీ చేశారని, అంటే దాదాపు 92% పెన్షన్ పంపిణీ చేశారని తెలిపారు.అనంతరం పాత రాజరాజేశ్వరి పేట లోని జేపీ అపార్ట్మెంట్స్ ను పరిశీలించి అక్కడ డ్రైనేజ్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని, మురుగుపారుదలకు ఏమైనా అంతరాయం ఉంటే వెంటనే వాటిని తొలగించి మురుగుపారుదలకు ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ సత్యనారాయణ, సిడిఓ శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## కలిసి పని చేద్దాం. కలిసి నేర్చుకుందాం.

**సమస్యలను పరిష్కరిస్తూ ప్రక్రియను వేగవంతం చేద్దాం వియంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, జూలై 1(నేటి శుభోదయ):- ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేస్తూ, ఒకరికొకరు సహకరించుకుంటూ, ఎదురయ్యే సమస్యలను పరస్పరం పంచుకుని పరిష్కరించుకుంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయవచ్చని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ ఈఆర్వో, డిప్యూటీ డీఈఓ ధ్యానచంద్ర తెలిపారు.బుధవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిని పరిశీలించేందుకు పాయకాపురం, పాత రాజరాజేశ్వరి పేట, గాంధీనగర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు అందించారు. గాంధీనగర్‌లోని కందుకూరి కళ్యాణ మండపంలో ఏఈఆర్వో, పర్యవేక్షణ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి. సత్యకుమారి ఆధ్వర్యంలో పనిచేస్తున్న బీఎల్ఓలతో మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియపై ప్రత్యక్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా తెలుసుకున్నారు. అదే సమయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఈఆర్వోలు, విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని మూడు నియోజకవర్గాల ఏఈఆర్వోలు, బీఎల్ఓలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన దిశానిర్దేశం చేశారు.ప్రతి బీఎల్ఓ ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కార మార్గాలను అందరికీ తెలియజేస్తూ, ఒకరు నేర్చుకున్న విధానాన్ని మిగతావారితో పంచుకోవాలని సూచించారు. అలాగే ఏఈఆర్వోలు, సూపర్వైజర్లు స్వయంగా ఒక ఎన్యుమరేషన్ ఫారాన్ని మ్యాపింగ్ చేసి, డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్వహించడం ద్వారా ఎదురయ్యే సాంకేతిక అంశాలను అర్థం చేసుకుని, బీఎల్ఓలకు సులభంగా మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. దీనివల్ల ూ×= ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందన్నారు.విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అన్ని నియోజకవర్గాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ, బీఎల్ఓలకు మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియపై నిరంతరం అవగాహన కల్పిస్తూ పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం పాయకాపురం ప్రాంతంలో ఏఈఆర్వో చీఫ్ సిటీ ప్లానర్, కె. సంజయ్ రత్నకుమార్, బీఎల్ఓల పనితీరును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఓటరు నింపిన ఎన్యుమరేషన్ ఫారాన్ని స్వీకరించారు. ఏఈఆర్ఓ కే.సంజయ్ రత్నకుమార్, అక్కడికక్కడే మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసిన పని తీరును పరిశీలించారు.ప్రతి అర్హత కలిగిన ఓటరును ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టకుండా నిర్ణీత గడువులోపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పూర్తి చేయాలని, ఇందుకు అవసరమైన సహకారం అందిస్తూ ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు.


## సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధి. పేదల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం. ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూలై 1(నేటి శుభోదయ):- సెంట్రల్ లోని 59వ డివిజన్ సింగ్‌నగర్ లూనా సెంటర్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితర లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పెన్షన్ నగదును అందజేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ, ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుకునేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్ సమన్వయంతో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పెంపు, దీపం-2.0, తల్లికి వందనం, శ్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, ఉచిత ఇసుక విధానం, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం వంటి పథకాలు పేద ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకొస్తున్నాయని ఉమా పేర్కొన్నారు.సెంట్రల్ నియోజకవర్గంలో ఇప్పటికే 350 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తూ ప్రతి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నేరుగా వారి వద్దకే వెళ్లి పరిష్కరించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఉమా అన్నారు. ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవడం, ప్రతి యువకుడికి ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగేలా చేయడం, ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందేలా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని బొండా ఉమా స్పష్టం చేశారు.అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి రాజధాని నిర్మాణం, పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పనతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ కార్యదర్శులు వింజమూరి సతీష్, ూని గౌసియా, సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పైడితలసి, డివిజన్ అధ్యక్షులు రాజన బంగారునాయుడు, ప్రధాన కార్యదర్శి బుదాల సురేష్, మరక శ్రీనివాస్, దాసరి కనకరావు, ఆలా తారకరామారావు, నందేటి ప్రేమ్, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు బొమ్మదేవర రత్నకుమారి, లూర్ద్ రాజు, డోల జనార్ధన్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా ఉండటమే కూటమి ప్రభుత్వం అజెండా

**ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా**
**ప్రతి నెలా ఒకటో తేదిన ఫించన్లు అందచేస్తున్నాం ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, జూలై 1(నేటి శుభోదయ):- రాష్ట్రంలోని పేదలకు అండగా ఉండటమే తమ కూటమి ప్రభుత్వ అజెండా అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రతి నెలా ఒకటో తేదిన లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్ళి వారికి ఫించను అందచేస్తున్నామని చెప్పారు. బుధవారం ఉదయం తూర్పు లోని 9వ డివిజన్‌లో జరిగిన ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొన్నారు. అనంతరం డివిజన్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని ఒక్క సారిగా రూ.4 వేలకు పెంచి రెండు నెలల బకాయిలను సైతం లబ్ధిదారులకు స్వయంగా ఇంటికి వెళ్ళి అందచేశామన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రంలో చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో కష్ట పడుతున్నారని, అయినా పేదల సంక్షేమం ఎక్కడా ఆగకూడదనే ఉద్దేశ్యంతో ప్రతి నెలా ఒకటో తేదిన ఫించన్లు క్రమం తప్పకుండా అందచేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో 'సర్' కార్యక్రమం చక్కగా జరుగుతుందని, బీఎల్‌వోలు ఇంటికి వచ్చిన సమయంలో వారికి పూర్తి సమాచారాన్ని అందచేసి ప్రజలు వారికి సహకరించాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల వెంట ఉన్న సర్వీస్ రోడ్లలో డ్రైనేజీ, నీటి సౌకర్యం కల్పనకు చర్యలు

**బెంజ్‌సర్కిల్ ఫీడర్ రోడ్డులో 50 లక్షల వ్యయంతో**
**డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, జూలై 1(నేటి శుభోదయ):- నగరంలోని జాతీయ రహదారుల వెంట ఉన్న సర్వీస్ రోడ్లలో డ్రైనేజీ సౌకర్యంతో పాటుగా తాగునీటి సదుపాయాన్ని కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. బుధవారం ఉదయం తూర్పులోని 9వ డివిజన్ బెంజ్‌సర్కిల్ ఆంజనేయ స్వామి గుడి ఫీడర్ రోడ్డులో 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు పాల్గొని నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ జాతీయ రహదారికి ఆనుకుని సర్వీస్ రోడ్లలో డ్రైనేజీ, నీటి కనెక్షన్లు, మురుగునీటి సౌకర్యం కల్పించడానికి జాతీయ రహదారుల శాఖ అధికారులతో మాట్లాడి ఇక్కడ ఫీడర్ రోడ్డులో మొదటి సారిగా డ్రైనేజీ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. జాతీయ రహదారుల వెంట నివాసం ఉండే వారికి డ్రైనేజీ, తాగునీరు సౌకర్యం కల్పించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇక్కడ ఒక్క చోటే కాకుండా నగరంలోని బెంజ్‌సర్కిల్ నుంచి రామవరప్పాడు వరకు ఉన్న జాతీయ రహదారి వెంట ఉన్న సర్వీస్ రోడ్డులో, బందరురోడ్డులో కూడా డ్రైనేజీ సౌకర్యం కల్పించడానికి అంచనాల రూపొందించి నిధులు సమకూర్చుకుని పనులు చేపడతామన్నారు. దీని ద్వారా జాతీయ రహదారుల వెంట ఉన్న సర్వీస్ రోడ్డలో నివశించే వారికి డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చెన్నుపాటి గాంధీ,మాజీ కార్పోరేటర్ చెన్నుపాటి క్రాంతిశ్రీ,ముమ్మనేని ప్రసాద్, కర్ణ రమేష్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, చిలకలపూడి నరసింహారావు, మొటపర్తి లక్ష్మి, శివలక్ష్మి, చిప్పల సుబ్బారావు, కెల్లా రమేష్ నాయుడు, పునమల ఆంజనేయులు,గళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం విజయ్‌పై 'హార్స్ ట్రేడింగ్' ఆరోపణలు!



చెన్నై: తమిళనాడు సీఎం విజయ్‌కు షాక్ తగిలింది. తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలను రాజీనామా చేసేలా విజయ్, టీవీకే సెక్రటరీ వైకో ప్రలోభ పెడుతున్నారని డీఎంకే ఆర్గనైజింగ్ సెక్రటరీ గవర్నర్‌కు లేఖ రాశారు. తమ ఎమ్మెల్యేలకు డబ్బుల ఆశ చూపుతూ హార్స్ ట్రేడింగ్‌కు పాల్పడుతున్నారని లేఖలో ఆరోపించారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసి దాదాపు రెండు నెలలు గడిచిన తమిళనాడు రాజకీయాలు ఇంకా చల్లబడడం లేదు. తాజాగా డీఎంకే పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.ఎస్ భారతి సీఎం విజయ్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఆ రాష్ట్ర గవర్నర్‌కు లేఖ రాశారు. ఆ లేఖలో... డీఎంకే పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు టీఎం, రాజేంద్రన్, సెంథిల్ సెల్వన్ లను తమ ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా చేయాల్సిందిగా తమిళనాడు సీఎం విజయ్ ఒత్తిడి చేస్తున్నారు. దీనికోసం హార్స్ ట్రేడింగ్ ఎమ్మెల్యేల బేరసారాలకు పాల్పడుతున్నారు. కనుక గవర్నర్ తక్షణమే చర్యలు తీసుకొని పూర్తి స్థాయి విచారణకు ఆదేశించాలి. వీరిద్దరు డీఎంకే గుర్తుపై గెలిచిన వ్యక్తులు కనుక తప్పనిసరిగా ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. అదే విధంగా డీఎంకే ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.ఎస్. భారతి తమిళనాడు గవర్నర్‌తో పాటు అవినీతి నిరోధక శాఖ కు కూడా అధికారికంగా లేఖ రాశారు. అయితే ఇటీవల సీఎం విజయ్ తన మిత్రపక్షాలతో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి VCK,IUML,MDMK పార్టీలను ఆహ్వానించారు. త్వరలోనే విజయ్ సెక్యూలర్ ఫ్రంట్ అనే కొత్త కూటమిని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా కొద్దిరోజుల క్రితం డీఎంకే అధినేత ఎం.కే స్టాలిన్ మాట్లాడుతూ తమిళనాడులో ఏ క్షణాన్నైన ఎన్నికలు రావచ్చు అన్నారు. దీంతో విజయ్ తన ప్రత్యర్థులకు చెక్ పెట్టి తన బలం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నాడని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## మహంత్ నృత్య గోపాల్ దాస్‌కు తీవ్ర అస్వస్థత



అయోధ్య: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్ అనారోగ్యంతో లక్నోలోని మేదాంత ఆస్పత్రిలో చేరారు. 86 ఏళ్ల వయసున్న మహంత్ నృత్య గోపాల్ దాస్ ఈ ఏడాది ఆస్పత్రిలో చేరడం ఇది రెండోసారి. గత జనవరిలో ఆయన అనారోగ్యానికి గురై 'మేదాంత'లోనే చికిత్స పొందారు. ఆ సమయంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వయంగా ఆయనను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహంత్ కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. 2022 ఏప్రిల్ 24న కూడా ఆయన యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్, కిడ్నీ ఇన్ఫెక్షన్, క్రానిక్ రీనల్ ఫెయిల్యూర్ వంటి సమస్యలతో మేదాంత ఆస్పత్రిలో చికిత్స పొందారు. అంతేకాకుండా గతంలో ఆయన కోవిడ్-19 బారిన పడి, వైద్యుల పర్యవేక్షణలో కోలుకుని అయోధ్యకు తిరిగి వచ్చారు. వయోభారం కారణంగా ఆయన నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంటున్నారు. మహంత్ నృత్య గోపాల్ దాస్ 1938 జూన్ 11న మథురలో జన్మించారు. అయోధ్యలోని అతిపెద్ద ఆలయమైన 'మణి రామ్ దాస్ కీ చావని'కి ఆయన పీఠాధిపతిగా ఉన్నారు. 1993లో విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు చేసిన రామ్ జన్మభూమి న్యాస్ ట్రస్ట్‌కు ఆయన అధ్యక్షుడిగా వ్యవహరించారు. దశాబ్దాలుగా సాగిన రామ్ జన్మభూమి ఉద్యమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. 2001లో ఆయనపై, ఆయన శిష్యులపై బాంబు దాడి జరగ్గా, స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. ఆ తర్వాత 2003లో ఆయన రామ జన్మభూమి న్యాస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.

## రాఘవ్ చద్దాకు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు



న్యూఢిల్లీ: రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా తన పర్సనాలిటీ రైట్స్ (వ్యక్తిత్వ హక్కులు) ఉల్లంఘన జరిగిందంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉపశమనం కల్పించేందుకు నిరాకరించింది. తన పేరు, ఫోటోలను దుర్వినియోగం చేస్తూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను తొలగించాలని కోరుతూ ఆయన కోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ కేసులో వ్యక్తిత్వ హక్కుల ఉల్లంఘన ఏమీ లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ ధర్మాసనం.. ప్రాథమికంగా పరువు నష్టం కలిగించేలా ఉన్నట్లు గుర్తించిన ఐదు సోషల్ మీడియా పోస్టులను, పత్రాలను తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. వీటి మినహా సామాజిక మాధ్యమాల్లో ఉన్న మిగిలిన కంటెంట్ ఏదీ పరువు నష్టం కలిగించేలా లేదని, అందువల్ల మిగతా పోస్టుల విషయంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని కోర్టు స్పష్టం చేసింది. రాజకీయ నాయకులపై వచ్చే విమర్శలు, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా వాక్ హక్కుల మధ్య ఖచ్చితమైన సమతుల్యతను పాటించాల్సిన అవసరం ఉందని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. రాజకీయ క్షేత్రంలో తీసుకునే నిర్ణయాలపై వచ్చే విమర్శలను పర్సనాలిటీ రైట్స్ పరిధిలోకి తీసుకురాలేమని అభిప్రాయపడింది.ు

## 'పాక్'లో కూలిన ట్యూషన్ సెంటర్ పైకప్పు.. 14 మంది మృతి!



లాహోర్: పాకిస్తాన్‌లోని లాహోర్ నగరంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాహ్లో జిల్లా పరిధిలోని ఈద్గా బస్తీ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక నివాస భవనం పైకప్పు కూలిపోయింది. అక్కడ ఒక ప్రైవేట్ ట్యూషన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈ ఘటనలో 14 మంది పాఠశాల విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన సమయంలో ఏడు నుండి 13 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు క్లాసులో ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు, స్థానికులు శిథిలాల నుండి 20 మందిని సురక్షితంగా బయటకు తీశారు. గాయపడిన వారిలో ఒక మహిళా ఉపాధ్యాయురాలితో పాటు మరో ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. భవనంపై కార్మికులు పనులు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని, నాణ్యతా లోపమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించి కాంట్రాక్టర్‌తో సహా ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విషాద ఘటనపై పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ ఈ ప్రమాదానికి కారణమైన వారిని గుర్తించి, వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసులను, జిల్లా అధికారులను ఆదేశించారు.

# నాటోతో అమెరికాకు తల్లాక్?




ద నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్.. క్లుప్తంగా నాటో.. ఇప్పుడు నాటో-అమెరికా మధ్య ఇడుపు కాయితం.. అదే విడాకులు జరగనున్నాయా? నాటో నుంచి అమెరికా పూర్తిగా వైదొలిగిపోతుందా? అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ (రావివ నవస్త్రంవ్రష్ట) దీనిపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ సైనిక అత్యవసర పరిస్థితి లేదా యుద్ధం వస్తే.. నాటో కూటమికి ఎలాంటి సైనిక సహాయం పంపాలనే నియమాలను ఆయన మార్చేశారు. దీని సారాంశం ఏమిటంటే.. నాటో దేశాలకు ఇకపై అమెరికా మద్దతు చాలా చాలా తక్కువగా ఉంటుంది.

### నాటోకు ఈ సపోర్ట్ ఉండదు..

విమాన వాహక నౌకలు ఉండవు
క్యారియర్ యుద్ధ విమానాలు ఉండవు
ఖచ్చితమైన లక్ష్యాలను ఛేదించే ఆయుధాలు ఉండవు
లాజిస్టికల్ సరఫరా (రవాణా సదుపాయాలు) ఉండదు
శాటిలైట్ మద్దతు కూడా చాలా పరిమితంగా ఉంటుంది.

### చైనాతో యుద్ధానికి సిద్ధం??

అమెరికా అధికారిక ప్రకటన ప్రకారం.. చైనాతో ఏ క్షణంలోనైనా యుద్ధం రావచ్చనే ఉద్దేశంతో అమెరికా పనిచేయాలని హెగ్సెత్ భావిస్తున్నారు. అందుకే.. చైనాతో పోరాడటానికి అవసరమయ్యే ఏ సైనిక వనరులను కూడా ఇతర ప్రాంతాలకు తరలించకూడదని నిర్ణయించారు. ఇక అనధికారికంగా చూస్తే ఇరాన్ యుద్ధం తర్వాత, ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ యుద్ధాలు చేసే సామర్థ్యాన్ని అమెరికా కోల్పోయింది. అన్ని వనరులను కేవలం చైనా కోసమే కేటాయించాలని అమెరికా నిర్ణయించుకున్నప్పుడు, ఇక ప్రపంచంలో మరెక్కడా జోక్యం చేసుకోలేదు. ఇరాన్ యుద్ధాన్ని ట్రంప్ ప్రభుత్వం నడిపిన తీరు వల్ల, తూర్పు అర్ధగోళం నుంచి అమెరికా తన పట్టును కోల్పోతుందనేది నిర్వివాదాంశం..! రాజకీయంగా ట్రంప్ ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చేసింది. అదేంటంటే.. ఐరోపా ఇక తనను తాను కాపాడుకోవాలే తప్ప.. అమెరికా సాయం ఉండదు.

### భవిష్యత్ ఏమిటి?

అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంతో.. నాటో కూటమి పేపర్‌పై మాత్రమే మిగిలి ఉంటుంది. యుద్ధం ప్రారంభం కావడానికి ముందే అమెరికా చేతులెత్తేస్తే, ఐరోపా దేశాల వద్ద లేని ప్రత్యేకమైన అమెరికన్ ఆయుధాలు రావని తేలిపోతే.. ఇక నాటో కూటమికి అర్థమే ఉండదు. దీంతో, నాటో కథ ముగిసినట్లే అవుతుంది!. 1949 నుండి నాటో ప్రణాళిక ఎలా ఉందంటే అమెరికా కొన్ని పెద్ద సైనిక సామర్థ్యాలను అభివృద్ధి చేస్తుంది, ఐరోపా దేశాలు వాటిని చేయవు. ఐరోపా దేశాలు ఎప్పుడూ అమెరికాపై ఆధారపడేలా చేయడం కోసమే యూఎస్ఏ అలా చేసింది. ఒకవేళ యుద్ధం వస్తే, వారి సైన్యాలన్నింటినీ అమెరికానే కమాండ్ చేయాలనేది దాని ఆలోచన. కానీ ఆ వ్యవస్థ ఇప్పుడు ముగిసిపోయింది. ఐరోపాలో అమెరికా తన సైనిక ప్రభావాన్ని కోల్పోయింది.

### ఐరోపాకు కింకర్తవ్యమ్..?

ఇప్పుడు ఐరోపా దేశాలు తమను తాము రక్షించుకోవడానికి సిద్ధమవుతున్నందున, అమెరికాతో ఉన్న 'ఇంటర్‌ఆపరబిలిటీ' అంటే.. కలిసి పనిచేసే సామర్థ్యం దెబ్బతింటుంది. అమెరికా ఆయుధ వ్యవస్థలు చాలా దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించడానికి, ఎక్కువ కాలం మన్నికగా ఉండటానికి డిజైన్ అయ్యాయి. కానీ ఐరోపా దేశాలు ఎదుర్కొనే యుద్ధాలు అలాంటివి కావు. ఒక యుద్ధంలో తమ సైన్యాన్ని నడిపించే అమెరికాతో కలిసి పనిచేయడం కోసమే ఐరోపా దేశాలు ఇంతకాలం అమెరికా ఆయుధాలను కొనుగోలు చేశాయి. కానీ అమెరికా సైన్యమే రానప్పుడు, ఇక ఆ ఆయుధాలను వాడటంలో ఎలాంటి అర్థం లేదు. ప్రస్తుత డ్రోన్ల యుగంలో.. అమెరికా తరహా ఆయుధ వ్యవస్థలను నిర్మించుకోవడానికి ఐరోపాకు 10 నుండి 15 ఏళ్ల సమయం లేదు. అంత వేగంగా వాటిని నిర్మించలేరు. కాబట్టి, వారు ఉక్రెయిన్ తరహా ఆయుధాలను తయారు చేసుకుంటారు. వీటికి బ్యాకప్‌గా బహుళ-దేశాల అణ్వాయుధ రక్షణను ఏర్పాటు చేసుకుంటారు. ఇది ఎలా సాగుతుందో కాలమే చెప్పాలి. సరిగ్గా ఒక సంవత్సరంలోనే ఐరోపా, అమెరికా సైన్యాలు కలిసి పనిచేసే సామర్థ్యాన్ని కోల్పోతాయి. ఒకవేళ ఏదైనా కారణం వల్ల వారు కలిసి పనిచేయాల్సి వచ్చినా, వేర్వేరు కమాండ్ స్ట్రక్చర్స్, వేర్వేరు వ్యూహాలతో పనిచేయాల్సి ఉంటుంది. వాషింగ్టన్ తీసుకున్న ఈ రాజకీయ నిర్ణయం వల్ల నాటో కూటమికి చరమగీతం పాడినట్లవ్వడమే కాకుండా.. ఐరోపా దేశాలు తీసుకునే ఆయుధ కొనుగోలు నిర్ణయాలు కూడా ఈ కూటమిని శాశ్వతంగా ముగించేలా చేస్తాయి. నాటో (చీూూ) ప్రయాణం చాలా అద్భుతంగా సాగింది. కానీ ఇప్పుడు అమెరికా ఒక వ్యూహాత్మక విచ్ఛిన్నం , సరికొత్త ప్రపంచ సమీకరణాల వైపు అడుగులు వేస్తోంది. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఐరోపా, అమెరికా ఒకే వైపు కాకుండా, రెండు వేర్వేరు ధ్రువాలుగా మిగిలిపోయే ప్రమాదం లేకపోలేదు.

# డేటా సెంటర్లపై బేజారు



చార్లీ చాప్లిన్ అద్భుత దృశ్యకావ్యాల్లో ఒకటైన 'గోల్డ్ రష్' నిరుడు శతవసంతాలు పూర్తిచేసుకుంది. 1890ల్లో కెనడాలోని క్లోన్‌డైక్ ప్రాంతంలో బంగారం గనులున్నాయని వెల్లడై ప్రపంచం నలుమూలలనుంచీ వేలాదిమంది జనం అక్కడికి పరుగులు తీయడం, పోటీపడటం కథాంశం. ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ కృత్రిమ మేధ(ఏఐ)కి సంబంధించిన డేటా సెంటర్లలో పెట్టుబడుల్ని ఆకర్షించటానికి అలాగే పరుగులు తీస్తున్నాయి. నిరుడు అక్టోబర్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం విడుదల చేసిన విశ్లేషణ డేటా సెంటర్ల సామర్థ్యం మరో నాలుగేళ్లలోనే మూడు రెట్లు పెరుగుతుందని అంచనా వేసింది. అదే సమయంలో తీవ్ర ఉష్ణోగ్రతలు, కరువుకాటకలు, ఇతర వాతావరణ దుష్ఫలితాల కారణంగా డేటా సెంటర్ల వార్షిక ఖర్చులు 2035కు 8,100 కోట్ల డాలర్లనుంచి 2065 నాటికి 16,800 కోట్ల డాలర్లకు పెరుగుతాయని అంచనా వేసింది. ఇప్పటికే క్లౌడ్ కంప్యూటింగ్ నిర్వహించటానికి... ఓటీటీలు, యూట్యూబ్‌వంటి వాటికోసం లైబ్రరీల నిర్వహణకూ, ఇతరేతర వినియోగానికీ డేటా సెంటర్లున్నాయి. ఏఐ రాకతో ఇవి మరింతగా పెరుగుతున్నాయి. డేటా సెంటర్ల విస్తరణతోపాటే వాటికి సంబంధించిన అవగాహన మొదలైంది. వాటివల్ల కలిగే దుష్పరిణామాల గురించి ఇప్పుడిప్పుడే అందరికీ తెలుస్తోంది. ఆన్‌లైన్ సెర్చ్‌లతో పోలిస్తే ఏఐ ఆధారిత సెర్చ్‌లు పది రెట్లు అధిక విద్యుత్‌ను తీసుకుంటున్నా యని గణాంకాలు తేల్చాయి. ఈమధ్య విడుదలైన ఐక్యరాజ్యసమితికి చెందిన యూనివర్సిటీ అధ్యయన నివేదిక డేటా సెంటర్లను చల్లబరచడానికి బిలియన్లకొద్దీ లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు ఆవిరైపోతున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ డేటా సెంటర్ల వల్ల తాగునీటి హక్కులకూ, వ్యవసాయానికీ తీవ్ర విఘాతం కలుగుతోందని హెచ్చరించింది. వీటిని అనుమతించే ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో పునరుత్పాదక ఇంధన వనరు ఉన్న ప్రాంతాలనే ఎంచుకునేలా చూడాలని సూచించింది. వినియోగిస్తున్న నీరు ఆవిరయ్యే ప్రస్తుత విధానానికి బదులు నీటి అవసరం లేని ఎయిర్ కూలింగ్, లిక్విడ్ ఇమ్మర్షన్ కూలింగ్‌వైపు మారేలా డేటా సెంటర్లపై ఒత్తిడి తేవాలని ప్రభుత్వాలకు సలహా ఇచ్చింది. డేటా సెంటర్లు తాము వినియోగించే నీరు, విద్యుత్ ఎంతో... విడుదలయ్యే కర్బన ఉద్గారాల పరిమాణం ఎంతో తెలిపే డేటాను అందరికీ అందుబాటులో ఉంచేలా నిబంధనలు రూపొందించాలని తెలిపింది. డేటా సెంటర్లపై అక్కడక్కడా ఆందోళనలు పెరుగుతున్నాయి. ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో ఈ సెంటర్లు పెరగటాన్ని నిరసిస్తూ ఉద్యమాలు జరగటంతో కొత్తవాటిపై కఠిన మైన ఆంక్షలు విధించారు. నెదర్లాండ్స్‌లో కూడా రైతులు, పర్యావరణవేత్తలు ఆందోళ నలు చేశారు. దాంతో హైపర్‌స్కిల్ డేటాసెంటర్ల నిర్మాణాలను ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధించింది. సింగపూర్‌లో పర్యావరణహిత సెంటర్లకు పరిమితమైన అనుమతు లిస్తున్నారు. చిలీలో డేటా సెంటర్ ఏర్పాటుపై జనం తిరగబడటంతో గూగుల్ సంస్థ గాలితో చల్లబరిచే సాంకేతికత దిశగా ప్రాజెక్టును డిజైన్ చేసుకుంది. ఏడాదిలో 365 రోజులూ వేలాది సర్వర్ రాక్‌లూ, డిజిటల్ డేటాను భద్రపరిచే హార్డ్ డ్రైవ్‌లూ, నెట్‌వర్కింగ్ పరికరాలూ, లక్షలసంఖ్యలో యూపీఎస్‌లు పనిచేస్తుండటంవల్ల వాటిని చల్లబరచటానికి నిరంతరాయంగా నీరు అవసరమవుతుంది. భారీగా విద్యుత్ కావలసివస్తుంది. ఇక ఆ సెంటర్లలోవాడే భారీ కూలింగ్ ఫ్యాన్లు , ఇండస్ట్రియల్ ఏసీల వల్ల ఒకరకమైన ధ్వని తప్పదు. పగలు ఇతర చప్పుళ్లతో ఇది కలిసిపోయినా, రాత్రివేళల్లో మూడు నాలుగు కిలోమీటర్ల మేర ఈ ధ్వని వినబడుతుంది. జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో, అమెరికాలోని వర్జీనియాలో కేవలం ఈ కారణం వల్లే స్థానికులు కోర్టులకెక్కారు. ప్రజల ఒత్తిళ్లతో ఈమధ్య కాలిఫోర్నియాలోని ఒక మున్సిపాలిటీ కొత్త డేటా సెంటర్లపై నిషేధం విధించింది. వీటన్నిటి నేపథ్యంలో నీటి అవసరం పెద్దగా లేని సాంకేతికతలు వస్తున్నాయి. ఏఐ ఆధారిత సాంకేతికత ద్వారా ఒక్క చుక్క నీరు కూడా అదనంగా వినియోగించకుండా కట్టడి చేస్తున్నారు. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరిస్తే, ఆ సెంటర్లు వినియోగించే పర్యావరణహిత సాంకేతికతల సమాచారాన్నీ, వాటి ఉద్గారాల పరిమాణాన్నీ ప్రజలకూ, పర్యావరణవేత్తలకూ అందుబాటులో ఉంచితే ప్రజల్లో ఉండే ఆందోళన తగ్గుతుంది.

# 'పుట్టుకతో పౌరసత్వం' సబబే

**ఈ దేశంలో జన్మించిన ప్రతి ఒక్కరూ ఇక్కడి పౌరులే**
**అమెరికా సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు**
**ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వు కొట్టివేత**
**అది రాజ్యాంగ విరుద్ధమని న్యాయస్థానం స్పష్టీకరణ**
**అమెరికాలో నివసిస్తున్న విదేశీయులకు భారీ ఊరట**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలసల విధానానికి దేశ అత్యున్నత న్యాయస్థానంలో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. అమెరికాలో నివసిస్తున్న విదేశీయులకు భారీ ఊరట లభించింది. అమెరికా గడ్డపై జన్మించినవారికి పౌరసత్వం ఇవ్వడం సమంజసమేనని అమెరికా సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. 'జన్మతః పౌరసత్వం'వెసులుబాటుకు కళ్లెం వేస్తూ డొనాల్డ్ ట్రంప్ 2025 జనవరిలో జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వును న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. అమెరికాలో చట్టవిరుద్ధంగా లేదా తాత్కాలికంగా నివసిస్తున్న వారికి పుట్టిన పిల్లలు అమెరికా పౌరులు కారని తేల్చిచెబుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టింది. జన్మతః పౌరసత్వం విస్తృత భావనను సమర్థించింది. తల్లిదండ్రులు అమెరికాలో చట్టవిరుద్ధంగా లేదా తాత్కాలికంగా ఉన్నప్పటికీ.. వారికి పుట్టిన పిల్లలకు 14వ రాజ్యాంగ సవరణ అమెరికా పౌరసత్వాన్ని కల్పిస్తోందని సుప్రీంకోర్టు పేర్కొంది. ట్రంప్ ఆర్డర్‌ను నిలిపివేస్తూ దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సుప్రీంకోర్టు 6--3 తీర్పుతో సమర్థించింది. ఈ దేశంలో జన్మించిన ప్రతి ఒక్కరూ ఇక్కడి పౌరులేనని(చాలా పరిమితమైన మినహాయింపులతో) సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చరిత్రాత్మక తీర్పునిచ్చారు. అంతర్యుద్ధం తర్వాత ఆమోదించిన 14వ సవరణపై సుదీర్ఘకాలంగా ఉన్న అవగాహనపై, ఇటీవలి ఫెడరల్ చట్టాలపైనా ఆధారపడి ఈ తీర్పును వెలువరించారు. "అప్పుడైనా, ఇప్పుడైనా పౌరసత్వం అంటే హక్కులను కలిగి ఉండే హక్కు. అంటే రాజకీయ సమాజంలో స్వేచ్ఛగా పాలుపంచుకునే హక్కు. 14వ రాజ్యాంగ సవరణను రూపొందించినవారు.. ఈ దేశంలో స్వేచ్ఛగా జన్మించిన ప్రతి వ్యక్తికీ పౌరసత్వం హామీని వర్తింపజేశారు. ఆ వాగ్దానాన్ని ఈ రోజు మనం నిలబెట్టుకుంటున్నాం"అని న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ తమ తీర్పులో వెల్లడించారు. ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను ఆరుగురు జడ్జీలు వ్యతిరేకించగా, ముగ్గురు సమర్థించారు.

### 'బర్త్ టూరిజం'ఆందోళనకరం: డి.జాన్ సౌర్

అమెరికాలో జన్మించిన విదేశీయుల పిల్లలకు పౌరసత్వం విషయంలో ట్రంప్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ సొలిసిటర్ జనరల్ డి.జాన్ సౌర్ సమర్థించారు. జన్మతః పౌరసత్వ నిబంధనను ప్రధానంగా పూర్వకాలంలో బానిసలుగా ఉన్నవారికి, వారి పిల్లలకు పౌరసత్వం మంజూరు చేయడానికి తీసుకొచ్చినట్లు చెప్పారు. అమెరికాలో 'బర్త్ టూరిజం'విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. పుట్టే పిల్లలకు అమెరికా పౌరసత్వం కోసమే విదేశీయులు ప్రత్యేకంగా ఇక్కడికి వస్తున్నారని విమర్శించారు. అయితే, ఇందులో నిజం ఎంతో చెప్పాలని న్యాయమూర్తులు ప్రశ్నించగా, కచ్చితమైన గణాంకాలు లేవని అంగీకరించారు. అమెరికా రాజ్యాంగం, న్యాయపరమైన నిర్ణయాలు, వ్యాఖ్యానాలు జన్మతః పౌరసత్వాన్ని బలంగా సమర్థిస్తున్నాయని పిటిషనర్లు వాదించారు. ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వు అమల్లోకి వస్తే తమ పౌరసత్వ హక్కులకు ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. ట్రంప్ ఉత్తర్వులు ప్రతికూల పరిణామాలకు దారితీసే అవకాశం ఉందని న్యాయ నిపుణులు హెచ్చరించారు. అమెరికాలో ఏటా జన్మంచే దాదాపు 2,50,000 మంది శిశువులపై దీని ప్రభావం పడే అవకాశం ఉందని, అలాగే లక్షలాది కుటుంబాలు తమ శిశువుల పౌరసత్వ హోదాను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని నిపుణులు వెల్లడించారు.

### ట్రంప్‌కు ఈ ఏడాది రెండో పరాభవం

సుప్రీంకోర్టులో ఈ కేసు మౌఖిక వాదనల సందర్భంగా ఒకసారి డొనాల్డ్ ట్రంప్ స్వయంగా హాజరయ్యారు. సుప్రీంకోర్టు ఎదుట హాజరైన తొలి సిట్టింగ్ అమెరికా అధ్యక్షుడిగా రికార్డుకెక్కారు. కానీ, కేసులో విచారణ ముగియక ముందే అక్కడినుంచి వెళ్లిపోయారు. అమెరికా అత్యున్నత న్యాయస్థానం ఈ ఏడాది ట్రంప్ కీలక విధానపరమైన నిర్ణయాన్ని రద్దు చేయడం ఇది రెండోసారి. ప్రపంచవ్యాప్తంగా విధించిన విస్తృతమైన సుంకాలను కోర్టు ఈ ఏడాది ఫిబ్రవరిలో కొట్టివేసింది. తాజాగా ట్రంప్ పరిపాలనా యంత్రాంగానికి మరో ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. జన్మతః పౌరసత్వం అనేది వలస వ్యవస్థ దుర్వినియోగాన్ని ప్రోత్సహిస్తుందని ట్రంప్ ఆరోపిస్తున్నారు. ఆయన విధించిన ఆంక్షలను పలు దిగువ న్యాయస్థానాలు నిలిపివేశాయి. దాంతో అవి అమెరికాలో ఎక్కడా అమల్లోకి రాలేదు. జన్మతః పౌరసత్వం విషయంలో కోర్టు తనకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చే అవకాశం ఉందని ట్రంప్ ముందే గ్రహించారు. 'బుద్ధిలేని న్యాయమూర్తులు'అని ఆక్షేపిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. పుట్టబోయే శిశువులకు అమెరికా పౌరసత్వం దక్కడం కోసం ప్రసవించడానికి అమెరికాకు ఇతరదేశాల ధనిక గర్భిణి స్త్రీలపైనా విమర్శలు ఎక్కుపెట్టారు.

### విభేదించిన ముగ్గురు జడ్జీలు

### ట్రంప్ ఉత్తర్వును కొట్టివేస్తూ సుప్రీంకోర్టు

ఇచ్చిన తీర్పుతో ధర్మాసనంలోని ముగ్గురు న్యాయమూర్తులు విభేదించారు. జస్టిస్ క్లారెన్స్ థామస్, జస్టిస్ నీల్ గోర్సచ్, జస్టిస్ శామ్యూల్ అలిటో ఈ తీర్పును ఆక్షేపించారు. 14వ రాజ్యాంగ సవరణను రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కోర్టు తీవ్రమైన పొరపాటు చేసిందని అన్నారు. కేవలం బిడ్డకు జన్మనిచ్చు, వెంటనే స్వదేశాలకు తిరిగి వెళ్లే 'బర్త్ టూరిస్టుల'ను ప్రోత్సహిస్తారా? అని నిలదీశారు. కోర్టు అసాధారణ నిర్ణయం తీసుకుందని, ఇది విచారకరమని పేర్కొన్నారు. ఈ మేరకు వారు 91 పేజీల అసమ్మతి లేఖ రాశారు.

# కర్నూలు జీజీహెచ్.. బాధిత కార్మికులకు అండగా ఉంటాం



అమరావతి: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో (జీజీహెచ్) అనేక సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న తమను కొత్త కాంట్రాక్టర్ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధుల నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో కర్నూలు జీజీహెచ్‌లో శానిటేషన్ పనుల కాంట్రాక్ట్‌ను పద్మావతి హాస్పిటాలిటీ ఏజెన్సీకి అప్పగించిన అనంతరం, ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను అకస్మాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగించారని కార్మికులు తెలిపారు. దీంతో తమ కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొంటూ, తమకు న్యాయం చేయాలని వైయస్ జగన్‌ను కోరారు. వారి సమస్యలను ఓపికగా విన్న వైయస్ జగన్, ఉద్యోగాలు కోల్పోయిన పారిశుధ్య కార్మికులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. వారి ఉద్యోగాల పరిరక్షణ కోసం అవసరమైన న్యాయపరమైన సహాయాన్ని పార్టీ లీగల్ సెల్ ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పార్టీ అన్ని విధాలా తోడుగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# టాపిక్.. ప్లేస్.. డేట్.. టైమ్ రేవంత్ చెప్పాలి: కేటీఆర్



హైదరాబాద్: తమ పాలనలో కేంద్రం సహకరించకపోయినా అభివృద్ధి చేశామని.. బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన కట్టడాలను చూసి ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా ప్రశంసిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. నాలుగేళ్లలోనే ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కట్టామన్న కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏం తెచ్చారంటూ ప్రశ్నించారు. "రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. సీఎం రేవంత్ తీరుతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుంది. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ఆదాయం నెలకు రూ.18,500 కోట్లు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అరాచక పాలన చేస్తున్నారు. రుణమాఫీ పేరుతో రైతులకు సీఎం రేవంత్ రూ.29 వేల కోట్లు ఎగ్గొట్టారు. అబద్ధాలు చెప్పడం సీఎం రేవంత్ జన్మహక్కు" అంటూ కేటీఆర్ దుయ్యబట్టారు. "సీఎం రేవంత్, ఆయన సోదరులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. డబ్బులు లేవంటూనే రూ.200 కోట్లతో అందాల పోటీలు నిర్వహించారు. సీఎం రేవంత్ రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. సీఎం రేవంత్‌తో చర్చకు నేను సిద్ధం. టాపిక్.. ప్లేస్, డేట్.. టైమ్ రేవంత్ చెప్పాలి. సవాల్ విసిరి పారిపోయే అలవాటు సీఎం రేవంత్‌దే. మీ తప్పులను బయటపెట్టకపోతే రాజకీయాలను నుంచి తప్పుకుంటా. ఉద్యోగాలు, రైతు డిక్లరేషన్.. దేనిపైనైనా చర్చకు రెడీ" అంటూ కేటీఆర్ సవాల్ విసిరారు.

# అయోధ్య చోరీ కేసు.. 8 మందిలో ఎవరెంత దోచుకున్నారంటే?



అయోధ్య : అయోధ్య రామాలయ నిధుల చోరీ కేసులో 8 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ నిందితుల్లో లవ్ కుశ్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రా అత్యధిక అమౌంట్ చోరీ చేసినట్లు అంచనా వేస్తున్నారు. ఆ చోరీ సొత్తును ప్రాపర్టీల్లో ఇన్వెస్ట్ చేశారు. ఇప్పటి వరకు అరడజను పైగా ప్రాపర్టీలను ట్రేస్ చేశారు. ఆ ఇద్దరికి చెందిన ఆర్థిక లావాదేవీలను ఆదాయపన్ను శాఖ పరిశీలిస్తున్నది. డబ్బు చోరీ కేసులో ఈడీ కూడా దర్యాప్తు చేపట్టాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో అత్యధిక నగదును అవినాశ్ శుక్లా నుంచి రికవరీ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందే.. అవినాశ్ శుక్లా ఇచ్చిన సమాచారం ప్రకారం 89 లక్షల నగదును పోలీసులు రికవరీ చేశారు. రెయిడ్ సమయంలో అతని కుటుంబానికి చెందిన ఓ యోగా సెంటర్ నుంచి మరో 5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. లవ్ కుశ్ మిశ్రా పూర్వీకుల ఇంట్లో ఉన్న ఆవుపేడ కింద దాచిన 12 లక్షల నగదు కూడా రికవరీ చేశారు. ప్రతి నెలా కేవలం 12 వేల జీతం తీసుకునే మిశ్రా.. ఆలయ చోరీ సొత్తుతో భార్య పేరు మీద 25 లక్షల ఇళ్లు కట్టినట్లు గుర్తించారు. అతని బ్యాంక్ అకౌంట్లు, బినామీ ఆస్తులను పరిశీలిస్తున్నారు. మనిశ్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి ఇంటి నుంచి 36 లక్షలు రికవరీ చేశారు. రాంశంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ యాదవ్‌కు చెందిన ఇంటి నుంచి క్యాష్, జ్వలరీ, ప్రాపర్టీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులను కూడా విచారించారు. టెంపుల్ విరాళాలను ఓ ప్రైవేటే ఏజెన్సీ ద్వారా ఆ బ్యాంకు కౌంటింగ్ నిర్వహిస్తోంది. నాలుగు డొనేషన్ బాక్సులకు చెందిన డబ్బును 14 మంది సభ్యుల బృందం లెక్కిస్తుంది. దీంట్లో 11 మంది బ్యాంకు ఉద్యోగులు, ముగ్గురు ఆలయ ట్రస్టు సభ్యులు ఉంటారు. నిందితులు అకౌంట్ రూమ్‌లోకి యాక్సెస్ సంపాదించి అక్రమ రీతిలో డబ్బును దోచుకున్నట్లు దర్యాప్తుదారులు అంచనా వేశారు. అనుమానిత వ్యక్తుల బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే, వాళ్ల అకౌంట్లలో ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించామని పోలీసులు చెప్పారు. ఈ కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది. అయోధ్య విరాళాల చోరీ కేసులో అరెస్టు అయిన వారిలో అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాత్సవ్, రాంశంకర్ యాదవ్ ఉన్నారు. విరాళాల హుండీ నుంచి ఈ 8 మంది డబ్బులు దోచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# బుడ్డర్ ఖాన్ మాటలతో ఇజ్జత్ తీసుకుంటున్న రేవంత్ రెడ్డి : కేటీఆర్



హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి ఎకరానికి రైతుబంధు వేయడానికి ఒక సభ పెడుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. కేంద్రం మీద యుద్ధం చేస్తా, పంట కొనిపిస్తా అని మొన్నటిదాకా రేవంత్ రెడ్డి తీస్మార్ ఖాన్ లాగా డైలాగులు కొట్టిండు. ఇప్పుడు మోదీ ఎంత పంట కొనమని చెప్తే అంతే కొంటా అని బుడ్డర్ ఖాన్ మాటలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆ 53 కిమీ...అక్రమ వలసలకుకేరాఫ్ అడ్రస్!

### బంగ్లాదేశ్ నుంచి అసోం, బెంగాల్‌మీదుగా చొరబాటు

### ఆయా సరిహద్దుల్లో25, 28 కి.మీ పరిధిఅనుకూలం

### వీరికి కోల్‌కతాలోని హౌరానుంచి నకిలీ గుర్తింపుకార్డులు

# 'ఆ దారి' నుంచే భారత్‌లోకి..



హైదరాబాద్: ఇండో--బంగ్లా సరిహద్దుల్లోని రెండు రాష్ట్రాల్లో ఉన్న 53 కిలోమీటర్ల ప్రాంతం అక్రమంగా సరిహద్దులు దాటి వచ్చే వారికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అసోంలో ఉన్న 25 కిమీ, పశ్చిమ బెంగాల్‌లోని 28 కిమీ ప్రాంతాల్లోని లోపాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న బంగ్లాదేశీయులు సరిహద్దులు దాటుతున్నారు. కోల్‌కతా నుంచి నకిలీ గుర్తింపుకార్డులు పొంది దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి బెంగాల్ వాసులుగా స్థిరపడుతున్నారు. ఇలా వచ్చిన వారిలో మహిళలు, యువతులు వ్యవస్థీకృత వ్యభిచారం, పురుషులు..యువకులు దినసరి కూలీలుగా స్థిరపడుతున్నారు. ఖైరతాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇటీవల పట్టుకున్న ఐదుగురు బంగ్లాదేశీయుల విచారణలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

### ఆ రెండు రాష్ట్రాల నుంచే ఈజీ...

బంగ్లాదేశ్ సరిహద్దు సుమారు 4,096 కిమీ పొడవు ఉంది. ఇది పశ్చిమ బెంగాల్, అసోం, మేఘాలయ, త్రిపుర, మిజోరం రాష్ట్రాల మీదుగా వెళ్తుంది. అయితే పశ్చిమ బెంగాల్, అసోంల్లో ఉన్న 53 కిలోమీటర్లు మాత్రమే అక్రమంగా సరిహద్దులు దాటడానికి అనుకూలంగా ఉంది. అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించాలని భావించే వాళ్లు బంగ్లాదేశ్‌లోని జషోర్ జిల్లాకు చేరుకుంటున్నారు. ఈ సరిహద్దు సుమారు 102 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. ఇందులో శార్షా ఉపజిల్లాలోని బెనపోల్ రెండు దేశాల మధ్య ప్రయాణికులు, సరుకుల రవాణాకు అత్యంత కీలకమైన ప్రాంతం. అయితే పశ్చిమ బెంగాల్‌లోని 24 పరగణాలు, మాల్దా జిల్లాల్లోని 28 కిమీ...అసోంలోని ధుబ్రి జిల్లాలోని బ్రహ్మపుత్ర నది పరీవాహక ప్రాంతంలో ఉన్న మరో 25 కి.మీ ప్రాంతమే అక్రమంగా ప్రవేశానికి అనుకూలంగా ఉంటోంది.

### పడవలు, పంటపొలాల మీదుగా...

ఈ రెండు ప్రాంతాలతో పాటు పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాలో ఉన్న గేడే, కృష్ణగంజ్, తేహట్ట, ముర్షిదాబాద్ జిల్లాలోని పద్మా నది పరీవాహక ప్రాంతాలు, దక్షిణ 24 పరగణాలు జిల్లాలోని సుందర్‌బన్స్ నదీ మార్గాలు, కూచ్‌బెహార్ జిల్లాలోని ఉత్తర సరిహద్దు ప్రాంతాలు అక్రమ వలసలకు ఉపకరిస్తున్నాయి. అలాగే అసోంలోని కరీమ్‌గంజ్ జిల్లాలో ఉన్న కుషియారా నది పరీవాహక ప్రాంతాలు, మాంకాచర్ జిల్లాలోని నదీ మార్గాలు, కాచర్ జిల్లాలోని కొన్ని సరిహద్దు గ్రామాల పరిసరాలు కూడా వారికి ఉపకరిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, నదులు, గ్రామాలు సరిహద్దుకు ఆనుకుని ఉండడంతో పాటు కంచె, సరైన గస్తీ లేకపోవడం అనుకూలంగా మారాయి. నదులను చిన్న పడవల ద్వారా దాటడం, రాత్రి వేళల్లో వ్యవసాయ భూముల ద్వారా ప్రవేశించి భారత్‌లోకి వచ్చేస్తున్నారు.

### హౌరా కేంద్రంగా...

ఇలా అక్రమంగా వలసవచ్చే వారికి సహకరించడానికి కోల్‌కతాలోని హౌరాలో కొన్ని ముఠాలు పని చేస్తున్నాయి. ఈ గ్యాంగ్స్ ఆ బంగ్లాదేశీయుల్ని బెంగాల్ వాసులుగా మార్చేస్తూ నకిలీ ఆధార్ కార్డులు సృష్టించి ఇస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో అక్కడే విద్యనభ్యసించినట్లు బోనఫైడ్ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నాయి. ఇలా భారతీయులుగా మారిపోతున్న ఈ బంగ్లాదేశీలను దేశంలోని వివిధ నగరాలకు తరలించడానికి దళారులూ కోల్‌కతాలో సిద్ధంగా ఉంటున్నారు. వీళ్లు దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసుకున్న నెట్‌వర్క్ సాయంతో యువతుల్ని వ్యభిచారం వైపు, యువకుల్ని కూలీ పనుల వైపు మళ్లిస్తున్నారు.

# డబుల్ ఇంజిన్.. డబుల్ ట్రబుల్



'యోగి ఆదిత్యనాథ్ ప్రసంగం నన్ను కట్టిపడేసింది. ఎందుకంటే ఆయన ప్రసంగంలో తమది డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకోవడమే ఇందుకు కారణం. అత్యంత ఆదర్శప్రాయమైన రాష్ట్రాలుగా ప్రచారం చేసుకుంటున్న వాళ్ల రాష్ట్రాల నుంచే అతిపెద్ద అవినీతి కథలు బయటకు వస్తున్నాయి. అవినీతి గురించి మాట్లాడటానికి ఈ వారమే చాలా సరైనదని అనుకొంటున్నాను. ఎందుకంటే ఈ మధ్య కాలంలో అవినీతి అనే పదాన్ని ఎన్నిసార్లు విన్నానంటే, ఆ మాట వింటేనే తల గిర్రున తిరిగిపోతున్నది.' ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బొద్దింకలు చేపట్టిన ఆందోళన నుంచి జరుగుతున్న వరుస పరిణామాలు చూద్దాం. తాజాగా అయోధ్య రామాలయ వ్యవహారాల్లో అక్రమాలు బయటపడ్డాయి. అలాగే ఉజ్జయినిలో బంధుప్రీతితో జరిగిన భూకుంభకోణంలో డబుల్ ఇంజిన్ ముఖ్యమంత్రి చిక్కుకున్నారు. వీటిన్నింటినీ చూస్తూ అవినీతిని విస్మరించడం కష్టంగా మారింది. అయితే ఈ సారి జాతీయ రాజకీయాల్లో అవినీతి అకస్మాత్తుగా ఏ విధంగా పెరిగిపోయిందోనని నేను ఆలోచిస్తుండగానే యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ టీవీలో ప్రసంగిస్తూ కనిపించారు. యోగి నవ్వుతూ ఏమంటున్నారంటే 'యూపీలో డబుల్ ఇంజిన్ సర్కార్ ' వల్లే రాష్ట్రం నంబర్‌వన్‌గా నిలిచింది అన్నారు. కానీ అది జరుగలేదు. కానీ పదేండ్లుగా యోగి ఆదిత్యనాథ్ ఉక్కు హస్తంతో (చాలా బుల్డోజర్లతో) పాలిస్తున్నారు. కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఉన్నచోటనే భారీ కుంభకోణాలు బయటపడుతున్నాయి. అందుకే యోగి ప్రసంగం నన్ను కట్టిపడేసింది. బుల్డోజర్ బాబా ప్రత్యక్ష పర్యవేక్షణలో అయోధ్య రామాలయం నిర్మించారు. కానీ ఆ గుడిలో భక్తులు విశ్వాసంతో కానుకలుగా సమర్పించిన బంగారం, వెండి, విలువైన ఆభరణాలు, నగదు లూటీ అయిన సంగతి ఆయనకు తెలియకపోవడం అత్యంత ఆశ్చర్యకరమైన విషయం. ఆలయంలో ఏం జరుగుతున్నదో నిధుల ధర్మకర్తలు గుర్తించకపోవడం కూడా అంతే అసాధారణమైన అంశం. ఆలయానికి వచ్చే కానుకలను లెక్కించేందుకు కచ్చితమైన విధానాలు అనుసరించాలని ఎప్పట్నుంచో వస్తున్న సూచనను ఎందుకు విస్మరించారో కూడా వారు వివరణ ఇవ్వాలి. వరుసగా వెలుగులోకి వస్తున్న విషయాలను పరిశీలిస్తే బాధ్యతారాహిత్యం అనేది నేరపూరిత స్థాయికి చేరిందని స్పష్టమవుతున్నది. ఐదేండ్లుగా నీట్ పరీక్ష కారణంగా వంద మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇటీవల నీట్ పరీక్ష రద్దయిన తర్వాత మనస్తాపం చెందిన మరో యువకుడు గతవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నిరుడు ఎక్కువ మంది విద్యార్థులు నీట్‌కు బలయ్యారు. నీట్ పరీక్ష నిర్వహణలో గందరగోళానికి కారణమైన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేయడం సరైనదే. ఇదే డిమాండ్‌తో ఆ పార్టీ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టింది. కానీ మంత్రి స్పందించలేదు. ఈ నేపథ్యంలోనే మంత్రికి ప్రధానమంత్రి సోషల్ మీడియా వేదికగా గంభీరమైన రీతిలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇక మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే అవకాశాలు ఎంత తక్కువగా ఉన్నాయో దీన్నిబట్టి స్పష్టమవుతున్నది. ప్రజాస్వామ్యంలో సేవకులైన పాలకుల నుంచి జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయడం పౌరుల హక్కు. కానీ ప్రధాన సేవకుడిగా చెప్పుకొనే వ్యక్తి, తన మంత్రులు, ముఖ్యమంత్రుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా తన ఇమేజ్ ఏ మేరకు దెబ్బతింటున్నదో గుర్తించడంలేదు. ముంబయిలో చాలా బహిరంగంగా అవినీతి జరుగుతున్నదన్న సంగతి మోదీకి తెలుసా? అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా మంత్రులు ఒబెరాయ్ హోటల్‌లో బస చేస్తున్నారు. వారి రేంజ్ రోవర్స్, ల్యాండ్ క్రూయిజర్స్, బీఎండబ్ల్యూ కార్లను రోజంతా అక్కడే పార్కింగ్ చేశారు. ఈ మొత్తం అంతటికీ ఖర్చు ఎవరు భరించాలి? మహారాష్ట్ర వంటి మరో డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో జరుగుతున్న విషయాలు మనం మర్చిపోకూడదు. పన్నెండేండ్ల క్రితం మోదీ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ నేను తినను... ఎవరినీ తిననివ్వను అని ప్రజలకు వాగ్దానం చేశారు. ఇక్కడ తినడం అంటే తినడం కాదు. తాను అవినీతికి పాల్పడి జేబులు నింపుకోనని, ఎవరూ అవినీతికి పాల్పడకుండా చూస్తానని ఆయన ఉద్దేశం. కాంగ్రెస్ పాలనలో విజృంభించిన అవినీతి పట్ల ప్రజలు అప్పటికే విసిగివేసారిపోయారు. మోదీ హామీ జనాలను ఆకట్టుకున్నది. ఆ మాటను నమ్మి బీజేపీకి అధికారం కట్టబెట్టారు. కానీ ఇప్పుడు అవినీతి నాయకులు పెద్దఎత్తున పెరిగిపోయారు. మోదీ ఎప్పుడో చెప్పిన మాటపై కట్టుబడి ఉంటారని ప్రజలు కూడా ఆశించడంలేదు. ఏదైనా కొత్త అవినీతి, కుంభకోణం బయటపడ్డప్పుడు.. ఎవరైనా ప్రశ్నిస్తే బీజేపీ అధికార ప్రతినిధులు ఏమంటారంటే, 'కాంగ్రెస్ హయాంలో ఇంతకంటే పెద్దఎత్తున అవినీతి జరిగింది' అని చెప్తుంటారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తే, కర్నాటకలో కూడా ముఖ్యమంత్రి వైదొలగాలని అంటుంటారు. ఎందుకంటే ఆ ముఖ్యమంత్రి ఆస్తులు కూడా అంతే మిస్టరీగా మారాయని సమర్థించుకుంటారు. అసలు నిజం ఏంటంటే ఎవరైనా సులభంగా ధనవంతులు కావాలంటే రాజకీయాలకు మించిన మార్గం లేదు. అందుకే చాలామంది తామే అధికారంలో కొనసాగాలని ఉవ్విళ్లూరుతుంటారు. ఇది కేవలం హిందుత్వ నేతలు అధికారం చేపట్టినప్పటి నుంచి మాత్రమే ఇలా లేదు. కానీ మోదీ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన ఏమైనా మార్పు తీసుకొస్తారని చాలామంది అనుకున్నారు. కానీ మోదీ ఆ పని చేయలేకపోవడం ఆయన వైఫల్యాల్లో ఒక స్పష్టమైన అంశం. గత వారం ఉజ్జయినిలో జరిగిన భూకుంభకోణం గురించి 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో కథనం ప్రచురితమైంది. కానీ జాతీయ స్థాయిలో ఇతర మీడియా మొత్తం ఈ స్థాయికి ఎదగకపోవడం బాధాకరం. మీడియా లొంగిపోయినట్టుగా వ్యవహరించడం గమనిస్తున్నాం.

# పోలవరం ముంపు.. తెలంగాణకు ముప్పు



ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే భారీ వర్షాలు, వరదల వల్ల తెలంగాణ భూభాగంలోని భద్రాచలం పరిసరాల్లోని గోదావరి తీర ప్రాంతంలో పెను విధ్వంసం జరుగనున్నది. ఈ వాస్తవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం గ్రహించాలి. దిగువన డ్యామ్ నిర్మాణంతో కాఫర్ డ్యామ్, స్పిల్ వే వల్ల బ్యాక్ వాటర్ (నదిలో స్థిరంగా ఉండే నీళ్లు) చుట్టుముడుతాయి. ముంపు మండలాల్లో పరిస్థితి మరీ దయనీయంగా మారే ప్రమాదం ఉన్నది. వరదలు వస్తే 30 రోజులపాటు జనావాసాలు జలమయమై తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు, చేయడానికి పనిలేక ప్రజలు ఇబ్బందులు పడుతారు. అటువంటి కీలకమైన ముంపు సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రాంత ప్రజల శ్రేయస్సు, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముంపు నివారణ చర్యలు చేపట్టకపోగా నిమ్మకు నీరెత్తినట్లు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయి. గతంలో అనేకసార్లు తెలంగాణ ఆత్మగల దార్శనికుడు కేసీఆర్ సమర్థ నాయకత్వంలో క్యాబినెట్ మంత్రిగా పోలవరం ముంపు సమస్యపై పెద్దఎత్తున తెలంగాణ పక్షాన వాదించాను. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి ముంపు నుంచి తెలంగాణవాసులకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేసినా కేంద్రం పట్టించుకోలేదు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని ఏపీ సీఎం చంద్రబాబు అంటున్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముంపు సమస్య పరిష్కారానికి చొరవ చూపకుండా ప్రజల ప్రయోజనాల పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ సోయి లేకుండా వ్యవహరిస్తున్నది. 2022లో భద్రాచలం వద్ద 71.3 అడుగుల ఎత్తులో వచ్చిన వరద 22 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహంగా నమోదైంది. పోలవరం పూర్తిస్థాయి నీటిమట్టం 45.72 మీటర్లు కాగా భద్రాచలం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి కూడా సరిగ్గా 45.72 మీటర్లు. అంటే పోలవరం నిండితే భద్రాచలం ఎప్పుడూ ముంపు ప్రమాదంలోనే ఉంటుందని భావించాలి. భద్రాచలం వద్ద గోదావరి నది లోతైన బెడ్ లెవల్ 26 మీటర్లు బ్యాక్‌వాటర్ ప్రభావం వల్ల భద్రాచలంలో ఎప్పుడూ 13.15 మీటర్ల నుంచి 17.72 మీటర్ల మేర నీరు నిల్వ ఉంటుంది. ఇది నిత్యం తీవ్రమైన సమస్యగా మారుతున్నది. 900 ఎకరాల్లో నష్ట ప్రభావం కూడా ఉంటుంది. 2021లో పోలవరం కాఫర్‌డ్యామ్ నిర్మాణం పూర్తయిన తర్వాత 2022లో వచ్చిన వరదల్లో బ్యాక్‌వాటర్ కారణంగా భద్రాచలంతో పాటు పరిసరాలు విలవిల్లాడాయి 40 శాతం భద్రాచలం పట్టణం జలమయమై, బాధితులు దీనావస్థలో రోడ్డున పడ్డారు. వరద బాధితులను అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఆదుకున్నది. అప్పట్లో 22 లక్షల క్యూసెక్కుల వరదకే ఇంత నష్టం జరిగితే..ప్రాజెక్టు డిజైన్ ప్రకారం భవిష్యత్తులో 36 లక్షల నుంచి 50 లక్షల సెక్యూల వరద వస్తే ఊహించని విధంగా ప్రాణ, ఆస్తి నష్టంతో పూర్తిగా మునిగిపోయే ప్రమాదం పొంచిఉన్నది. పలు అధ్యయనాల ప్రకారం 36 గ్రామాల పరిధిలోని 184 చదరపు కిలోమీటర్ల మేర ముంపు ప్రభావం పడుతుందని తెలుస్తున్నది. కేవలం గ్రామాలే కాకుండా ఈ ప్రాంతంలోని భారీ పరిశ్రమలకు కూడా బ్యాక్‌వాటర్ ముప్పు పొంచి ఉన్నది. దాదాపు ఐదువేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న ఐటీసీ పేపర్‌బోర్డ్, హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం జలవిద్యుత్తు ప్రాజెక్టులకు ఈ బ్యాక్‌వాటర్ వల్ల తీవ్ర ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంటుంది. దక్షిణాది అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రికి ఘనమైన ప్రాశస్త్యం ఉన్నది. అలాంటి రామాలయానికి కూడా పోలవరం ముంపు ముప్పు తప్పదు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పోలవరం ప్రాజెక్టు ద్వారా సంభవించే ముంపు ముప్పును నివారించేందుకు చర్యలు చేపట్టాలి. పునరావాస ప్యాకేజీ అమలు చేయాలి. గోదావరి వరద తట్టుకునేందుకు కరకట్టలు కట్టాలి. ఇప్పటికే ఉన్న వాటి కరకట్టల ఎత్తును పెంచాలి. వర్షాకాలంలో స్లూయిస్‌ల దగ్గర వరద నీరు ప్రవహించదు కనుక ఆ సమయంలో మోటర్ల ద్వారా నీటిని తోడేయాలి. లోతట్టు ప్రాంత ప్రజలను మెరక ప్రాంతానికి తరలించి కాలనీలు నిర్మించాలి. ఎక్కువగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. రహదారులపై ప్రవహించే వాగుల మీద చప్టాలు నిర్మించాలి. వంతెనలు ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట రోడ్ల ఎత్తు పెంచాలి. తక్షణ చర్యలతో పాటు మౌలిక సదుపాయాల రక్షణ, ప్రజల భద్రత, పర్యావరణ, సాంకేతిక చర్యలు, పరిశ్రమలు, వారసత్వ ప్రాంతాల రక్షణ, విధానపరమైన చర్యలు వంటి పలు కీలక అంశాలపై దృష్టి సారించాలి. తెలంగాణ ప్రజల రక్షణకు, వారి శ్రేయస్సు కోసం పాటుపడాల్సిన ఆవశ్యకత ప్రభుత్వాలపై ఉన్నది. ముంపు నుంచి తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా బాధ్యతాయుతంగా పనిచేయాలని బీఆర్ఎస్ తరఫున, ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నాం. మానవజాతిని కాపాడటం, భవిష్యత్‌తరాలకు మనం ఇచ్చే భద్రత. అదే అందరికీ శ్రీరామరక్ష.

EDITOR, Printed, Published and Owned by KOTLAPALLI FOUZIYAPrinted at Mis FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,SREEKANTAPURAM,HINDUPUR,SRI SATYA SAI,ANANTHAUR,ANDHPRADESH-515201.Cell7668886666Printing Press: FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,LAKSHMIPURAM,HINDUPUR,SRI SATYASAI,ANAN THAUR, ANDHPRADESH- 515201.RNI Regd No APTEL/26/A0016